## అనిల్ అంబానీకి మరో భారీ షాక్..

ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌నకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో గట్టి షాక్ ఇచ్చింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, తాజాగా రూ.1400 కోట్ల విలువైన ఆస్తులను ప్రొవిజనల్‌గా అటాచ్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.9000 కోట్లకు చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈడీ తాజాగా జప్తు చేసిన ఆస్తులు నవీ ముంబై, చెన్నై, పూణె, భువనేశ్వర్‌లలో ఉన్నట్లు సమాచారం. అనిల్ అంబానీ నేతృత్వంలోని కంపెనీలలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఈడీ కొంతకాలంగా విచారణ జరుపుతోంది. ఈ దర్యాప్తులో భాగంగానే తాజా చర్యలు తీసుకున్నారు.


www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

శుక్రవారం 21 నవంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 84 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-




### ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్

- హాజరైన మోదీ, చంద్రబాబు
- పాట్నాలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమం
- నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం
- సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు

# డిసెంబరులో పంచాయతీ

## మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు! ప్రభుత్వానికి డెడికేటెడ్ కమిషన్ నివేదిక

- 50 శాతం మించకుండా తాజాగా రిజర్వేషన్లు సిఫారసు చేసిన డెడికేటెడ్ కమిషన్
- పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల శాతం సిఫారసు చేసిన కమిషన్
- పంచాయతీ ఎన్నికలపై ఉన్నతాధికారులతో ఎస్ఈసీ సమావేశం
- ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల
- ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు
- డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయనున్న ప్రభుత్వం




*తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక నివేదికను సమర్పించింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చడానికి ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా నివేదిక సమర్పించింది.*

3లో..



### భారత వాయుసేన స్వరూపాన్నే మార్చే ప్రతిపాదన

- పుతిన్ పర్యటనకు ముందు రష్యా కీలక అడుగు
- భారత్‌కు రష్యా నుంచి కీలక సైనిక ఆఫర్
- సుఖోయ్-57 స్టెల్త్ ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీకి సంసిద్ధత
- పుతిన్ భారత పర్యటనకు ముందే కీలక పరిణామం

# రాష్ట్రం గజగజ



- బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం!
- సాయంత్రం 5 గంటలు అయ్యిందంటే చాలు రాష్ట్రం మొత్తం చలితో గజగజా
- ఈదురుగాలులు వీస్తుండటంతో చలి తీవ్రత
- రాబోయే రోజుల్లో మరింత పెరగనున్న చలి
- 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- 24 నాటికి వాయుగుండంగా మారే ఛాన్స్

హైదరాబాద్

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. తదుపరి 48 గంటల్లో ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో కదులుతూ మరింత బలపడి ఈ నెల 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. రాబోయే 48 గంటల్లో ఈ వాయుగుండం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి మరింత బలపడి నైరుతి బంగాళాఖాతం - మిగతా3లో

### పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు




- రేవంత్ సర్కార్ కీలక ఉత్తర్వులు
- ఏడేళ్ల తర్వాత కార్యదర్శులకు సూపరింటెండెంట్లుగా ప్రమోషన్
- ఒకేసారి 130 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల హర్షం
- ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని వినతి

## కేటీఆర్‌కు బిగ్ షాక్



- కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి
- ఈ-కారు రేసు కేసులో కేటీఆర్‌పై ఛార్జ్‌షీట్ వేసేందుకు ఏసీబీకి అనుమతి

హైదరాబాద్

తెలంగాణలో ఫార్ములా ఈ-కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చారు. దీంతో, ఈ-కారు రేసు కేసులో కేటీఆర్‌పై ఛార్జ్‌షీట్ వేసేందుకు ఏసీబీకి గవర్నర్ అనుమతి లభించినట్టు అయ్యింది. అయితే, కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి కోరుతూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ నేపథ్యంలో తాజాగా గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కాగా, ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ - మిగతా3లో




### రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదు

- 'బిల్లుల' అంశంపై సుప్రీం కీలక తీర్పు
- గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి.
- గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు
- కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు
- కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడి

### కర్ణాటకలో మళ్లీ తెరపైకి ముఖ్యమంత్రి మార్పు అంశం... ఢిల్లీకి డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు

# కడియం, దానంకు స్పీకర్ మళ్లీ నోటీసులు

- అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని స్పీకర్ స్పష్టం
- కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు స్పీకర్ ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు
- తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్న స్పీకర్
- ఈరోజుతో 8 మంది ఎమ్మెల్యేల పిటిషన్లపై పూర్తి కానున్న విచారణ
- ఈ నేపథ్యంలో ఇద్దరికి మరోసారి నోటీసులు జారీ చేసిన స్పీకర్



హైదరాబాద్

తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు స్పీకర్ మరోసారి నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని స్పీకర్ స్పష్టం చేశారు. అయితే, గతంలో ఇచ్చిన నోటీసుకు ఆయన సమాధానం ఇవ్వడానికి సమయం కావాలని కోరడంతో దానం నాగేందర్ మరో నోటీసును స్పీకర్ నుంచి అందుకోబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి - మిగతా3లో

# పెట్టుబడులకు వేదికగా హైదరాబాద్



- తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతాం
- తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారు
- సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసలైన అభివృద్ధి
- సీఎం రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

హైదరాబాద్

పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ - మిగతా3లో

# రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదు



**ఢిల్లీ:** రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నల (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్)పై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది.

**సుప్రీం తీర్పులో కీలక అంశాలివే..**

గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. 1. బిల్లులకు సమ్మతి తెలియజేయడం 2. కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం 3. బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం

ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదు.

గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.

నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుంది.

గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.

వివాదం లేకుండా ఉండాలంటే వీలునామా రాయాలి

పెండింగ్ బిల్లుల అంశం పూర్వాపరాలివీ..

శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

## భారత వాయుసేన స్వరూపాన్నే మార్చే ప్రతిపాదన



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే నెల భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో, భారత వాయుసేన భవిష్యత్తును మార్చేసే ఒక కీలక సైనిక ప్రతిపాదనను మాస్కో తెరపైకి తెచ్చింది. ఐదో తరం సుఖోయ్-57 స్టెల్త్ ఫైటర్ జెట్‌కు సంబంధించిన పూర్తి టెక్నాలజీని బదిలీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు ఏ దేశం కూడా ఇంతటి ఉన్నత స్థాయి రక్షణ సాంకేతికతను భారత్‌కు అందించడానికి ముందుకు రాలేదు. రష్యా ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ రోస్‌టెక్ సీఈఓ సెర్గీ చెమెజోవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దుబాయ్ ఎయిర్ షో 2025 సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలుత రష్యాలో తయారైన సుఖోయ్-57 ఫైటర్లను భారత్‌కు సరఫరా చేసి, ఆ తర్వాత దశలవారీగా వాటి ఉత్పత్తిని పూర్తిగా భారత్‌కు తరలిస్తామని తెలిపారు. అంతేకాకుండా, సింగిల్ ఇంజిన్ స్టెల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అయిన సుఖోయ్-75 చెక్‌మేట్‌ను కూడా భారత్‌కు ఆఫర్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంజిన్లు, సెన్సార్లు, ఏఈఎస్ఏ రాడార్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ, స్టెల్త్ మెటీరియల్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేస్తామని రష్యా స్పష్టం చేసింది. భారత్‌పై ఆంక్షలు ఉన్నప్పుడు కూడా ఆయుధాలు సరఫరా చేసి అండగా నిలిచామని, ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన భాగస్వామ్యం ఉందని చెమెజోవ్ గుర్తుచేశారు. పాశ్చాత్య దేశాలు నిరాకరిస్తున్న కీలక టెక్నాలజీని రష్యా ఆఫర్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. డిసెంబర్‌లో జరగనున్న 23వ భారత్-రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ భారత్‌కు రానున్నారు. ఈ పర్యటనలో రక్షణ రంగానికి సంబంధించి కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ పర్యటనకు సంబంధించిన సన్నాహక చర్చలు ప్రారంభమయ్యాయి.

## ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్



జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది. నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

# శబరిమలలో భక్తుల రద్దీ దృష్ట్యా..
# రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందం



శబరిమలలో నెలకొన్న భక్తుల రద్దీ విషయమై ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే శబరిమలలో తొలి జాతీయ విపత్తు నిర్వహణ దళం విధుల్లోకి చేరింది. ఈ మేరకు ప్రాంతీయ రిస్పాన్స్ సెంటర్‌కు చెందిన 4వ బెటాలియన్‌లోని 30 మంది సభ్యుల బృందం నవంబర్ 19న సన్నిధానానికి చేరుకుంది. ప్రస్తుతం వారు మెట్లు ప్రాంతం మరియు నడక మార్గాల వద్ద మోహరించారు. ఒకేసారి ప్రతి ప్రాంతంలో ఐదుగురు చొప్పున విధుల్లో ఉన్నారు. చెన్నై నుంచి వచ్చిన 38 మంది సభ్యుల మరో బృందం కూడా నిన్న రాత్రి చేరుకుంది. యాత్రికులకు సీఆర్పీ సహా అత్యవసర వైద్య సహాయం అందించేలా ప్రత్యేక శిక్షణ తీసుకున్న బృందం. అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్లు, స్ట్రెచర్లు తదితర సామగ్రిని సిద్ధం చేశారు కూడా. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించడంతో పాటు, రక్షణ కార్యక్రమాలను సమన్వయం చేసేలా అప్రమత్తంగా ఉన్నారు. అలాగే ఈ బృందం శబరిమల ఏడీఎం పోలీసుల ప్రత్యేక అధికారి ఇచ్చే సూచనల మేరకు పనిచేస్తుందని ఇన్‌స్పెక్టర్ జీసీ ప్రసాద్ తెలిపారు.

కట్టుదిట్టమైన ఆంక్షలు..

ప్రస్తుతం శబరిమలలో మరిన్ని ఆంక్షలు విధించారు. స్పాట్ బుకింగ్ 20 వేల మందికి పరిమితం చేశారు. పంపా చేరుకున్న భక్తులు తమ శబరిమల దర్శనాన్ని పూర్తి చేసుకుని నిర్ణీత సమయంలోపు తిరిగి వస్తారు. అధికంగా వచ్చే వారికి మరుసటి రోజు దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారుల పేర్కొన్నారు. నీలక్కల్ నుంచి పంపా వరకు ప్రవేశం పరిమితం చేసినట్లు తెలిపారు. భక్తులకు నీలక్కల్‌లో వసతి సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొంది ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు.

# అల్ ఫలాహ్ వర్సిటీ వ్యవస్థాపకుడిపై మరో ఫ్రాడ్ కేసు



టెర్రర్ ఫండింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్ధిఖీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే 13 రోజుల ఈడీ కస్టడీలో ఉన్న ఆయనపై తాజాగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రూ.2 కోట్ల మోసం కేసు నమోదైంది. దీంతో ఆయన అక్రమాల చిట్టా ఒక్కొక్కటిగా బయటపడుతోంది. వర్సిటీకి నకిలీ అక్రిడిటేషన్లు ఉన్నాయని, చట్టబద్ధమైన గుర్తింపు పొందినట్లు తప్పుడు ప్రచారాలు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసగించారని సిద్ధిఖీపై ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసం ద్వారా ఆయన సుమారు రూ.415.10 కోట్లు అక్రమంగా సంపాదించినట్లు ఈడీ గుర్తించింది. ఈ వ్యవహారంలో ఢిల్లీ బ్లాస్ట్ కేసుతో ఆయనకు సంబంధాలు ఉన్నాయనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. ఈ ఆరోపణలపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. ఆదివారం సిద్ధిఖీని అరెస్ట్ చేసి, డిసెంబర్ 1 వరకు కస్టడీకి తీసుకుంది. ఇక, భోపాల్‌లో నమోదైన కొత్త కేసు 24 ఏళ్ల నాటిది. 1997-2001 మధ్య కాలంలో సిద్ధిఖీ, అతని సోదరుడు హమూద్ సిద్ధిఖీ ఒక చిట్ ఫండ్ కంపెనీని నడిపి, డబ్బు రెట్టింపు చేస్తామని ప్రజల నుంచి భారీగా వసూలు చేసి పరారయ్యారని పోలీసులు తెలిపారు. గ్యాస్ బాధితులకు చెందిన నిధులతో కూడా ఉడాయించారని ఆరోపణలున్నాయి. పాత కేసులో సిద్ధిఖీ ముందస్తు బెయిల్ పొందగా, ఆయన సోదరుడు నిర్దోషిగా విడుదలయ్యారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని మో కంటోన్మెంట్ బోర్డు అధికారులు సిద్ధిఖీ పూర్వీకుల ఇంటికి నోటీసులు జారీ చేశారు. ఆ ఇంటిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించాలని నోటీసులో ఆదేశించారు. దర్యాప్తు సమయంలో యూనివర్సిటీకి సంబంధించిన అడ్మిషన్లు, ఫీజుల రికార్డులను సిద్ధిఖీ మార్చే అవకాశం ఉందని ఈడీ కోర్టులో వాదించింది.

## బిహార్ ఎన్నికల్లో ఓటమి.. ప్రశాంత్ కిశోర్ మౌనవ్రతం



బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోయింది. ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహిస్తూ ప్రశాంత్ కిశోర్ ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు. ప్రధాని మోదీ, ఎన్డీయే నాయకుల సమక్షంలో నీతీశ్ కుమార్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ప్రశాంత్ కిశోర్ ఈ వ్రతం చేపట్టడం గమనార్హం. ఇటీవల ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ పరాజయానికి 100 శాతం బాధ్యత తనదేనన్నారు. తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఈ క్రమంలోనే ఒకరోజు మౌనవ్రతం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన ప్రకారం.. తాజాగా భితిహర్వా గాంధీ ఆశ్రమంలో ఈ మౌనవ్రతాన్ని చేపట్టారు. ఇది ఈరోజు మొత్తం కొనసాగుతుందని పార్టీ తెలిపింది. ఇక, ఇటీవల ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ.. అధికార కూటమిపై ప్రశాంత్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు ప్రతి నియోజకవర్గంలో 60వేల మంది లబ్ధిదారులకు నీతీశ్ ప్రభుత్వం రూ.10వేలు చొప్పున ఇవ్వకుంటే ఆ పార్టీ 25 స్థానాలకే పరిమితమయ్యేదన్నారు. ఓట్లు పొందకపోవడం నేరం కాదని, అయితే.. అవినీతి, విభజన రాజకీయాలు మాత్రం తాను చేయలేదని అధికార పక్షాన్ని ఉద్దేశిస్తూ విమర్శించారు.

నీతీశ్ 10.0.. బిహార్‌లో కొలువుదీరిన ఎన్డీయే సర్కార్

ఇక, బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 సీట్లకు గాను.. 202 సీట్లు దక్కించుకొని ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. నేడు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు.

# కర్ణాటకలో మళ్లీ తెరపైకి ముఖ్యమంత్రి మార్పు అంశం




కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటిన నేపథ్యంలో డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ఈరోజు దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై గత కొన్ని నెలలుగా చర్చ జరుగుతోంది. రెండున్నర సంవత్సరాలు పూర్తయినందున సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశమివ్వాలని ఆయన వర్గం కోరుకుంటోంది. అయితే, పార్టీలో ముఖ్యమంత్రి మార్పు అంశాన్ని సిద్ధరామయ్య, శివకుమార్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తున్నారు. తాజాగా, డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి మార్పు అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచేందుకు యోచిస్తున్నట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇచ్చిన హామీ ప్రకారం డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని ఆయన వర్గం ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానాన్ని కోరనున్నారని సమాచారం. ఈ మేరకు ఎమ్మెల్యేలు ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తమ డిమాండ్‌ను ఆయన దృష్టికి తీసుకువెళ్లనున్నారు. రేపు ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్‌ను కూడా కలుస్తారని సమాచారం. ఢిల్లీకి వెళ్లిన డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలలో దినేశ్ గూలిగౌడ, రవి గణిగ, గుబ్బి వాసు ఉండగా, అనేకల్ శివన్న, నేలమంగళ శ్రీనివాస్, ఇక్బాల్ హుస్సేన్, కునిగల్ రంగనాథ్, శివగంగ బసవరాజు, బాలకృష్ణ తదితరులు రేపు ఉదయం చేరుకోనున్నారని సమాచారం. "నేను ఢిల్లీకి వెళ్లి బంగారం, వజ్రాలు ఏమైనా అడుగుతానా ఏమిటి? మా నాయకుడు డీకే శివకుమార్ కోసమే దేశ రాజధానికి వెళుతున్నా"ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ జాతీయ మీడియాతో అన్నారు. అంతకుముందు, డీకే సోదరుడు సురేశ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన మాటను నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నామని వ్యాఖ్యానించారు.

# డిసెంబరులో పంచాయతీ

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. డెడికేషన్ కమిషన్ బూసాని వెంకటేశ్వరరావు ఇవాళ సీఎస్ రామకృష్ణ రావుకు నివేదిక సమర్పించారు. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కమిషన్ తాజాగా రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం కోర్టులో ఉన్నందున పాత రిజర్వేషన్ల పద్ధతిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని ఈనెల 17న నిర్ణయించిన కేబినెట్ దానికి అనుగుణంగా సిఫార్సు చేయాలని డెడికేటెడ్ కమిషన్‌ను కోరింది.

**డిసెంబరు 16 వరకు పంచాయతీల ఎన్నికలు పూర్తి!**

మూడు రోజులుగా కసరత్తు చేసిన డెడికేడెట్ కమిషన్ నివేదికను సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిన తర్వాత దాని ఆధారంగా పంచాయతీ రాజ్ శాఖ కొత్త రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24న హైకోర్టులో విచారణ సమయానికి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం కొత్త రిజర్వేషన్ల జాబితా ఇస్తే ఈనెల 24 లేదా 25న షెడ్యూలు ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రణాళికలు సిద్ధం చేసింది. మూడు విడతల్లో డిసెంబరు 16 వరకు పంచాయతీల ఎన్నికలు పూర్తి చేయాలని ఎస్ఈసీ భావిస్తోంది.

**పంచాయతీ ఎన్నికలపై ఉన్నతాధికారులతో ఎస్ఈసీ సమావేశం**

ఇవాళ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదినీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగానికి రాణికుముదినీ తెలిపారు. గ్రామాల్లో ఓటరు జాబితాలో పొరపాట్ల సవరణ ప్రక్రియ ఈనెల 23 వరకు పూర్తి కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

**ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల**

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు విడుదల చేసింది. నేటి నుంచి నవంబర్? 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని తెలిపింది. ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణ, ఈ నెల 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు.

**ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు**

సోమవారం మంత్రి మండలి భేటీలో స్థానిక ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయ నిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇచ్చింది. దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ నెల 24న తెలంగాణ హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని అన్నా రు.

# సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్

**హైదరాబాద్ :** బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్ పెట్టేందుకు టీజీఎస్ఆర్టీసీ కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్లు తెచ్చింది. బస్సు ఆగితేనే డోర్లు తెరుచుకుంటాయి, కదులుతుంటే ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల భద్రత కోసం ఈ వినూత్న మార్పులు చేశారు. ఈ కొత్త బస్సులు ప్రమాదాలను తగ్గించి, ప్రయాణాన్ని సురక్షితంగా మారుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. హైలైట్:ఫుట్‌బోర్డు ప్రయాణాలు, ప్రమాదాలకు చెక్బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలు, కదులుతున్న బస్సుల నుంచి దిగడం వంటి ప్రమాదకర విన్యాసాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న మార్పులు చేపట్టింది. ప్రయాణికుల, ముఖ్యంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో అత్యాధునిక హైడ్రాలిక్ ఆటోమెటిక్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. స్టేజీ వద్ద బస్సు పూర్తిగా ఆగినప్పుడు మాత్రమే ఈ డోర్లు తెరుచుకుంటాయి. బస్సు కదులుతున్నప్పుడు లేదా వేగంగా ఉన్నప్పుడు ఇవి ఆటోమెటిక్‌గా మూసుకుని లాక్ అవుతాయి. దీనివల్ల ప్రయాణికులు పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కడం, కదులుతున్న బస్సు నుంచి దిగిపోవడం లేదా ఫుట్‌బోర్డుపై వేలాడటం కుదరదు. ఈ వ్యవస్థ విమానాశ్రయ బస్సులు (ఏసీ ఇంద్ర), హైఎండ్ డీలక్స్ బస్సుల్లో ఉండే సాంకేతికత తరహాలో పనిచేస్తుంది. యినగరంలో జరిగిన ప్రమాదాలపై ఆర్టీసీ అధికారులు లోతుగా అధ్యయనం చేశారు. ఎక్కువ ప్రమాదాలు ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్లే జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న మార్గాలపై దృష్టి సారించారు. ప్రయోగాత్మకంగా హయత్‌నగర్-2 డిపో పరిధిలో 45 'గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్' ఎలక్ట్రిక్ బస్సులను సిద్ధం చేశారు. ప్రస్తుతం 10 బస్సులు



ఇప్పటికే రోడ్డెక్కాయి. ముఖ్యంగా విద్యార్థులు అధికంగా ప్రయాణించే హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మార్గాల్లో ఈ హైడ్రాలిక్ డోర్ వ్యవస్థ ఉన్న బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. హకీంపేట కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లు రాగానే.. మిగిలిన 35 బస్సులు కూడా త్వరలో తిరగనున్నాయి. డిసెంబరు నాటికి మరిన్ని ఈ-బస్సులు ఈ మార్గాల్లో అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఒక్కొక్కటి సుమారు 60 మంది ప్రయాణికులు సౌకర్యవంతంగా కూర్చుని లేదా నిలబడి ప్రయాణించేలా రూపొందిం చబడ్డాయి. వీటి ద్వారా ఆక్యుపెన్సీ పెరుగుతుందని డిపో అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. మేడ్చల్ ? సికింద్రాబాద్, సికింద్రాబాద్ ? దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్ ? ఉప్పల్, కోఠి ? రామంతాపూర్, మెహిదీపట్నం ? ఆరాంఘర్, ఎల్బీనగర్ ? ఇబ్రహీంపట్నం, ఉప్పల్ ? ఘట్‌కేసర్ మార్గాల్లో విద్యార్థులు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. కాబట్టి ఇక్కడ ఈ కొత్త బస్సులను అత్యధిక సంఖ్యలో ప్రవేశపెట్టడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా అరికట్టవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త భద్రతా చర్యల వల్ల ఫుట్‌బోర్డు ప్రమాదాలు తగ్గుతాయని.. ప్రయాణం సురక్షితంగా మారుతుందని ఆర్టీసీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# లంచాలతో కోట్లు.. ప్రతి రోజు ఎవరో ఒకరు

**హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగం అనేది భరోసా మాత్రమే కాదు బాధ్యత కూడా. ఆ బాధ్యతను ఎంత సమర్థవంతంగా నిర్వర్తిస్తే ప్రజలకు అంత త్వరితగతిన సేవలు అందుతాయి. సేవలు త్వరితగతిన అందినప్పుడు ప్రజల్లో ప్రభుత్వం మీద నమ్మకం ఏర్పడుతుంది. ఆ నమ్మకం కాస్త ప్రభుత్వాన్ని సుస్థిరం చేస్తుంది. సుస్థిరమైన ప్రభుత్వం ఉంటే ఎటువంటి అద్భుతాలు జరుగుతాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.ప్రభుత్వ ఉద్యోగం అనేది కాసుల కురిపించే ఏటీఎం అని నేటి కాలంలో చాలామంది ఉద్యోగులు భావిస్తున్నారు. అందువల్లే ఉద్యోగాన్ని ఒక బాధ్యతలాగా కాకుండా దోపిడికి మార్గంగా భావించుకుంటున్నారు. కొందరు ఉద్యోగులతే వసూళ్లకు ఏకంగా వ్యక్తులను నియమించుకుంటున్నారు. తద్వారా కోట్లకు ఎదుగుతున్నారు. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఏసీబీ నమోదు చేస్తున్న కేసులను బట్టి.. ప్రభుత్వ ఉద్యోగులు ఏ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారు అర్థం చేసుకోవచ్చు. సబ్ కలెక్టర్ నుంచి మొదలు పెడితే పంచాయతీ కార్యదర్శులకు అందరూ దొరికిపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని బాధ్యతలాగా నిర్వర్తించకుండా.. వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులను మాత్రమే మనం చూశాం. ఏసీబీ కూడా అటువంటి సిబ్బంది మీద మాత్రమే కేసులు నమోదు చేస్తోంది. ఈ కథనంలో మాత్రం అధికారి అవినీతిని అంతకుమించి అనే స్థాయిలో ప్రదర్శించాడు .. ఏకంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పార్కును అమ్మేశాడు. దీనికోసం కోట్లు లంచంగా పుచ్చుకున్నాడు. ఏసీబీ అధికారుల పరిశీలనలో ఈ వాస్తవం వెలుగులోకి వచ్చింది. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నారు. ఏసీబీ అధికారులకు రిజిస్ట్రార్ ల పై విపరీతంగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు దాడులు చేస్తుండగా విస్మయకర వాస్తవాలు తెలుగులోకి వస్తున్నాయి.

**నెల రోజుల వ్యవధిలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ లు**

హైదరాబాద్ నగర పరిధిలోని వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నెలల వ్యవధిలోనే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లు సస్పెండ్



కావడం తీవ్ర దుమారం రేపుతోంది. కొన్ని రోజుల క్రితమే.. రాజేష్ అనే సబ్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కడంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఈ క్రమంలోనే ఆ స్థానంలో సీనియర్ అసిస్టెంట్ శివశంకర్‌కు ఇంఛార్జ్ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించారు. అయితే తాజాగా ఆయన అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో.. రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. దీంతో ఆ వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఏం జరుగుతోందని.. వరుసగా ఎందుకు సబ్ రిజిస్ట్రార్లు సస్పెండ్ అవుతున్నారు అనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వనస్థలిపురం ఇంఛార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ శివశంకర్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు అందడంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో శివశంకర్ అవినీతికి పాల్పడుతున్నారని గుర్తించారు. ఈ క్రమంలోనే ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఓ పార్కు స్థలానికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో.. శివశంకర్‌పై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వేటు వేసింది.కొన్ని నెలల క్రితమే ఆ స్థానంలో పనిచేసిన రాజేష్ అనే సబ్ రిజిస్ట్రార్ అవినీతి నిరోధక శాఖకు చిక్కడంతో అతడిని సస్పెండ్ చేశారు. ఈ క్రమంలోనే అదే ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివశంకర్‌కు సబ్ రిజిస్ట్రార్ ఇంఛార్జిగా తెలంగాణ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని 200 సర్వే నంబరులో వివాదానికి కారణమైన ఓ పార్కు స్థలం వ్యవహారానికి సంబంధించి శివశంకర్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి.సాహెబ్ నగర్ ప్రాంతంలో గతంలో ఉన్న లే అవుట్(అనధికారిక) ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అక్కడ ఉండే స్థానికులు.. పలు కోర్టులను ఆశ్రయించి అనుమతులు తీసుకుని తమ భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఇదే సమయంలో అక్కడ ఉన్న పార్కు ప్రాంతానికి కూడా బై నంబర్‌తో కొంతమంది రిజిస్ట్రేషన్ కోసం అప్లై చేయగా.. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ పూర్తి చేశారు. ఈ వ్యవహారంపై.. స్థానికులు తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలోనే వివిధ పత్రాలకు ఒకే ప్రాంతం ఫొటోలు చూపించినా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. అందులో పార్కు స్థలం కూడా ఉన్నట్లు ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు చూపించారు. ఈ విషయంలో సబ్‌రిజిస్ట్రార్ శివశంకర్ చాలా ఉదాసీనంగా వ్యవహరించినట్లు తేలింది. దీంతో శివశంకర్‌పై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే అధికారుల విచారణలో వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ శివశంకర్ తప్పు ఉందని గుర్తించడంతో సస్పెన్షన్ వేటు వేశారు.ఇటీవల స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి నిరోధక శాఖ దాడులు జరుగుతున్న నేపథ్యంలో.. కార్యాలయాల్లో ఉన్న లోపాలపై ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ల శాఖలో తెలంగాణ సర్కార్ కీలక సంస్కరణలు తీసుకువస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మారకపోవడంపై ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి.

## కడియం, దానంకు స్పీకర్ మళ్లీ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మూడు నెలల్లో (అక్టోబర్ 31, 2025 నాటికి) విచారణ పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆ అనర్హత పిటిషన్లపై విచారణను ఇప్పటికే ప్రారంభించారు. అయితే, విచారణను మరింత ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ విపక్ష బీఆర్ఎస్ నవంబర్ 17న సుప్రీంకోర్టులో స్పీకర్‌పై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీంతో, ఈ వ్యవహారంలో స్పీకర్ వేగం పెంచారు. మరోవైపు, పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఇప్పటివరకు ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తయింది. ఈ రోజుతో 8 మంది ఎమ్మెల్యేలకు చెందిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో సభాపతి వారిద్దరికి మరోసారి నోటీసులు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని అందులో పేర్కొన్నారు. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయ సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత సభాపతి నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

## కేటీఆర్‌కు బిగ్ షాక్

-మొదటిపేజీ తరువాయి

నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ ఇప్పటికే పలుమార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. రెండు సార్లు ఏసీబీ విచారణకు, ఒకసారి ఈడీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. ఇక, ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబరు 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై కేసు నమోదైంది. ఇక, తాజా పరిణామంతో త్వరలోనే కేటీఆర్‌పై అభియోగాలు నమోదు చేసేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది. విచారణ తర్వాతే ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. అదేవిధంగా, అటు కేసులో కీలక నిందితులైన ఐఏఎస్ అరవింద్ కుమార్‌పై డోపీటీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఒకవేళ కేంద్రం అనుమతి ఇస్తే ఆయనపై కూడా ఏసీబీ అభియోగాలు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉంది.

**ఫార్ములా ఈ కారు రేసు టైమ్‌లైన్..**

డిసెంబరు 18, 2024న ఎఫ్ఐఆర్ నమోదు
డిసెంబర్ 28, 2024 ఈడీ సమన్లు.
జనవరి 2, 2025న అర్వింద్ కుమార్ విచారణ.
జనవరి 3, 2025న బీఎల్ఎన్ రెడ్డి విచారణ.
జనవరి 7, 2025న కేటీఆర్ విచారణ.
జూన్ 2025లో ఏసీబీ రెండో దశ విచారణ.
జూన్ 16న కేటీఆర్ మరోసారి విచారణకు హాజరు.

## పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైల్‌కు మోక్షం కల్పిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో సుమారు 140 మందికి పైగా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలోని గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు. 2018 కంటే ముందు ప్రమోషన్ పొందిన వారికి 10 శాతం కోటా కింద ఇప్పుడు సూపరింటెండెంట్లుగా అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలోని రెండు మల్టీ జోన్ల పరిధిలో అర్హులైన 9 మందికి పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (పీఆర్, ఆర్డీ) శాఖ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 130 మందికి పైగా సీనియర్ అసిస్టెంట్లకు ఒకేసారి సూపరింటెండెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత మంత్రులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పీఆర్, ఆర్డీ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు.

## రాష్ట్రం గజగజ



-మొదటిపేజీ తరువాయి

ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రాగల రెండు రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుండి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది.

రాష్ట్రం మొత్తం చలితో గజగజ

కొద్దిరోజులుగా సాయంత్రం 5 గంటలు అయ్యిందంటే చాలు రాష్ట్రం మొత్తం చలితో గజగజా వణికిపోతోంది. ఉదయం 9 గంటలైనా ఆ ప్రభావం కొనసాగుతూనే ఉంది. రాత్రి నుంచి ఉదయం వరకు చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 7 డిగ్రీల సెల్సియస్, సంగారెడ్డి 7.1, ఆదిలాబాద్ 7.7, వికారాబాద్ 8.1, రంగారెడ్డి 8.2, కామారెడ్డి 8.5, సిద్దిపేట 8.6, నిజామాబాద్ 8.9, జగిత్యాల 9, మెదక్ 9.3, నిర్మల్ 9.4, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 9.9 డిగ్రీల సెల్సియస్‌ల వరకు నమోదవుతున్నాయి.

ఈదురుగాలులు వీస్తుండటంతో చలి తీవ్రత

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత పది రోజులుగా చలి తీవ్రత ఉధృతంగా కొనసాగుతుండగా బుధవారం మరింత అధికమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8 డిగ్రీల సెల్సియస్‌కు చేరగా మిగిలిన జిల్లాల్లో కూడా దాదాపు అదే పరిస్థితి ఉంది. గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు కూడా 27.5 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గటంతో పొద్దంతా కాస్తా చలితో కూడిన వాతావరణం ఉంటోంది. ఉష్ణోగ్రతల తగ్గుదలకు తోడుగా ఈదురుగాలులు వీస్తుండటంతో ప్రజలు చలి ప్రభావానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గాలిలో పెరిగిన తేమ శాతం

అధిక వర్షాలతో నేలలు చిత్తడిగా మారి గాలిలోని తేమశాతం పెరగటం, ఉత్తర భారతదేశం నుంచి చలి గాలులు వీస్తుండటం, వాతావరణ మార్పుల ప్రభావంతో నవంబరు మాసంలో సాధారణం కన్నా 2 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాధారణంగా డిసెంబరు నెలలో చలి అధికంగా ఉంటుంది. కానీ ఈ సీజన్‌లో మాత్రం నవంబరు నెల నుంచే చలి పంజా విసరుతోంది.

భౌగోళిక పరిస్థితి వల్ల

తెలంగాణలో శీతల గాలుల తీవ్రత ఎక్కువగా ఉండడానికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. ఇందులో ప్రధానమైంది తెలంగాణకు ఉన్న ప్రత్యేకమైన భౌగోళిక పరిస్థితి. ఏపీతో పోలిస్తే తెలంగాణ ఉత్తర, మధ్య భారతదేశానికి కొంచెం దగ్గరగా ఉంటుంది. ఇటీవల ఆ ప్రాంతాల్లో అధిక పీడనం ఏర్పడింది. దాని వల్ల అక్కడి నుంచి చల్లని, పొడి గాలులు దక్కన్ పీఠభూమిపై ఉన్న తెలంగాణ రాష్ట్రం వైపుగా వీస్తున్నాయి. దీంతో చలి తీవ్రత పెరిగింది.

# సీఎం గారు షాద్ నగర్ ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించండి..

తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత..
షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని సందర్శించిన కవిత..
ఆసుపత్రి అభివృద్ధి నిధులు లేవని ఆవేదన..
రోగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనీ హితవు..
పెచ్చులూడి అరకుర వసతులతో సర్కార్ దవాఖాన..
వంద పడకల ఆసుపత్రికి సేవలను మార్చాలని కవిత డిమాండ్..
లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణం పై అసంతృప్తి..
తెలంగాణ జాగృతి జనం బాటలో పర్యటించిన కవిత..





**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్** :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది అత్యంత నిరుపేదలే.. వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని తెలంగాణ జాగృతి అధినాయకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జనం బాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత ఆసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రి వైద్యులతో సిబ్బందితో పాటు రోగులను అడిగి పలు విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో కవిత మాట్లాడుతూ.. ఆసుపత్రిలో వైద్య సేవల స్థాయిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉందని ప్రభుత్వ ఆసుపత్రికి కేవలం నిరుపేదలు మాత్రమే వస్తారని అలాంటి పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలంటే సకల సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. షాద్ నగర్ ప్రభుత్వాసుపత్రిలో భవనం పెచ్చులూడిపోతుందని, ఎప్పుడు కురుస్తుందో తెలియదని వెంటనే దీనిని వంద పడకల ఆసుపత్రికి నూతన భవనంలో వైద్య సేవలను బదిలీ చేయాలని ఆమె ప్రభుత్వాన్ని ని డిమాండ్ చేశారు.

**ఆసుపత్రి అభివృద్ధి నిధులు రావడం లేదు..**

రోగుల తాకిడి ఎక్కువగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి నిధులు ప్రభుత్వం ద్వారా రావడంలేదని దీంతో అరకొర వసతులతో సదుపాయాలతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం లభించడం లేదని కవిత విమర్శించారు. ఇక్కడ రోగులకు మందులు ఇవ్వాలన్న లేక అనేక సదుపాయాలు కల్పించాలన్న నిధులు ఎంతో ముఖ్యమని ప్రభుత్వం ఆ దిశగా దృష్టిని సాటించాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె డిమాండ్ చేశారు. తను ఈ ఆస్పత్రి సందర్శించాక తను రెండు విషయాలు గుర్తించడం జరిగిందని శిథిలమైన భవనాన్ని వెంటనే వంద పడకల ఆసుపత్రికి మార్చాలని, అదేవిధంగా నాణ్యమైన వైద్య సేవల కోసం సిబ్బంది సంఖ్య పెంచాలని ఆమె కోరారు. గత నెల ఆసుపత్రిలో 120 ప్రసవాలు జరిగాయని, గైనకాలజిస్టుల కొరత ఉందని ఆరు మందికి ఒకరే ఉన్నారని పేర్కొన్నారు. 28 మంది సిబ్బందికి 12 మంది ఉన్నారని ఈ స్థాయి పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**షాద్ నగర్ నియోజకవర్గంలో పర్యటన కొనసాగుతోంది..**

షాద్ నగర్ నియోజకవర్గంలో జనం బాట కార్యక్రమం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా తాను శేరిలింగంపల్లి చేవెళ్ల రాజేంద్రనగర్ తదిత నియోజకవర్గాల్లో పర్యటించడం జరిగిందని ఇప్పుడు షాద్ నగర్ నియోజకవర్గంలో కూడా పర్యటించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ముఖ్యమైన లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు అక్కడ ఎలాంటి పనులు చేపట్టలేదని అందుకే అక్కడికి వెళ్లలేదని త్వరలోనే వాటి వివరాలు సేకరించి లక్ష్మీదేవి పల్లి గురించి మాట్లాడతానని మీడియాకు తెలిపారు. కవిత వెంట స్థానిక నాయకులు పాండురంగారెడ్డి, సీమ రమేష్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు..

# వరంగల్‌లో ప్రపంచ వారసత్వ వారోత్సవం విజయవంతంగా నిర్వహణ



**సామాన్యుడి అస్త్రం జనగామ** ప్రపంచ వారసత్వ వారోత్సవం (వరల్డ్ హెరిటేజ్ వీక్) సందర్భంగా వరంగల్ ప్రాంతంలోని పాఠశాల విద్యార్థుల్లో వారసత్వ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ హెరిటేజ్ శాఖ ఆధ్వర్యంలో నిడిగొండ లోని కాకతీయ కాలం నాటి త్రికూటాలయం లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాస రచన, పెయింటింగ్, క్విజ్ పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఆర్కియాలజీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, బాబు, స్థపతి రఘువీర్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ నుండి , శ్యామ్ రవిబాబు హాజరయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన 120 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.వారసత్య సంపదను కాపాడాల్సిన అవసరం, చారిత్రక కట్టడాల ప్రాముఖ్యత, మన ప్రాంతీయ పురాతన నిర్మాణాల ప్రత్యేకతలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. వ్యాస రచన , పెయింటింగ్ , ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలంగాణ హెరిటేజ్ శాఖ, వరంగల్

## జనగామ అమ్మ క్యాంటీన్



**సామాన్యుడి అస్త్రం జనగామ** దేవసాని జయ రమేష్ మానవతా దృక్పథంతో జనగామ జిల్లా ఆస్పత్రిలో పేద ప్రజలకి అన్న సమర్పణ కార్యక్రమం బియ్యం నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగభీమ్ రాజు మాట్లాడుతూ ఈరోజు అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించిన దేవసాని జయ రమేష్ కి అమ్మ ఫౌండేషన్ టీం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు మీ మీ పుట్టినరోజు పెళ్లిరోజు మరియు సందర్భం ఏదైనా కానీ నిరాశ్రయులకు అనాధలకు నిరుపేద కుటుంబాలకు ఒక పూట ఆకలిని తీర్చి జరుపుకోవాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సమాజంలో మానవత్వాన్ని బ్రతికించాలని కోరారు ఈ సేవా కార్యక్రమం లో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కొయ్యడ రవి, పండుగ నరేష్ బింగి నరసింహులు వెంపటి అజయ్ ఊల్లంగులమణి, బక్క మారయ్య బక్క సునీల్ ఎండి అప్రోచ్ రమేష్ ఎండి అజిత్ తదితరులు పాల్గొన్నారు

# రాజశేఖర్ హంతకులకు జీవిత ఖైదు తప్పదు

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
ఎల్లంపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ తదితర అధికారుల బృందం
రాజశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 4.12 లక్షల చెక్కు అందజేత
ఇలాంటి నరహంతకులను ఎట్టి పరిస్థితిలో వదిలిపెట్టం
ఎల్లంపల్లి సంఘటనను ముఖ్యమంత్రిని స్థితికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం
హైదరాబాద్ లో ఎర్ర రాజశేఖర్ కుటుంబానికి రూ.50 లక్షల విలువైన డబల్ బెడ్ రూమ్ ఇస్తాం
బాధిత కుటుంబానికి ఐదు ఎకరాల భూమిని ఇస్తాం
రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఆడియో సరిత, ఏసిపి లక్ష్మీనారాయణ తదితరులు
ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాలతో కదిలిన ప్రభుత్వ యంత్రాంగం
సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు నియోజకవర్గ దళితుల తరపున కృతజ్ఞతలు తెలిపిన "జాంగారి రవి"




**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్** : ఎల్లంపల్లి గ్రామ దళితుడు ఎర్ర రాజశేఖర్ ను అత్యంత ఘోరంగా హత్య చేసిన హంతకులకు భవిష్యత్తులో జీవిత ఖైదు ఎట్టి పరిస్థితుల్లో తప్పదని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ లక్ష్మీనారాయణ, సిఐ విజయ్ కుమార్ తదితర బృందం సభ్యులు రాజశేఖర్ కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. గ్రామానికి వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాజశేఖర్ భార్య ఎర్రవాణి, తండ్రి మల్లేష్ చేతులకు రూ 4.12 లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇంత ఘోరమైన సంఘటన జరగడం సభ్య సమాజం తల దించుకోవాలని ఆయన అన్నారు. ప్రేమించిన పాపానికి అతని అన్నను పాషవితంగా హత్య చేయడం ఇది ప్రపంచంలో ఎవరు కనివిని ఎరుగలేదని ఇంతటి అవమానకరమైన ఘటన మరొకటి లేదని చైర్మన్ బక్కి వెంకటయ్య మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత ఘోరంగా హత్య చేసి దహనం చేయడం వల్ల ఈ సంఘటన తెలిసి ఎంతో హృదయ విదారకంగా తన గుండెలు బరువెక్కాయని అన్నారు. సమాజంలో మానవతావాదులు మేధావులు విజ్ఞులు ప్రజాసంఘాలు మీడియా ప్రతినిధులు ప్రతి ఒక్కరు ఈ ఘటనలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామానికి వచ్చి రాజశేఖర్ కుటుంబ పరిస్థితిని చూస్తే తనకు ఎంతో బాధ కలుగుతుందని ఇంత దౌర్భాగ్య పరిస్థితిలో ఈ కుటుంబం ఉండడం చూస్తే దళితులు ఎంత దిగజారిన బతుకులు బతుకుతున్నారు తనకు అర్థమవుతుందని అన్నారు. రాజశేఖర్ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా హైదరాబాద్ లో అవసరమైతే 50 లక్షల విలువైన డబుల్ బెడ్ రూమ్ ఇల్లును అందజేస్తామని, అదేవిధంగా ఐదు ఎకరాల భూమిని అందజేస్తామని, ఆర్థికంగా ఉద్యోగపరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పరువు హత్యలు అలాంటి సంఘటనలు కొన్ని జరుగుతున్నాయని ఇది బాధాకరమని స్వతంత్రం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్న ఇంకా ఇలాంటి జాడ్యం కనిపించడం బాధాకరమన్నారు.

**అధికారులరా భద్రత కల్పించండి**

గ్రామంలో ఇంత పేదరికం అనుభవిస్తున్న రాజశేఖర్ కుటుంబానికి అధికారులు అండగా నిలబడాలని జిల్లా కలెక్టర్ అదేవిధంగా పోలీస్ శాఖలను ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. హైదరాబాద్ రాజధానికి ఇంత చెరువులో ఉన్న ఈ గ్రామాల్లో పరిస్థితి చూస్తుంటే ఆవేదన కలుగుతుందని ఇలాంటివారికి ప్రభుత్వ సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందుతాయని చైర్మన్ హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ గ్రామంలో వారికి నిందితుల నుండి పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. రాజశేఖర్ ను హత్య చేసిన నిందితులను ప్రభుత్వం వదిలిపెట్టబోదని ముఖ్య మంత్రితో మాట్లాడి వారికి యవజీవ కరాగర శిక్ష పడేవిధంగా పూర్తిస్థాయిలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా స్పందించినందుకు కమిషన్ చైర్మన్ వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే శంకర్ గురువారం గ్రామాన్ని సందర్శించి అధికార యంత్రంగానికి తగు ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఎస్ఎస్సి కమిషన్ సభ్యులు గ్రామానికి రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు జాంగారి రవి ఎమ్మెల్యేకు నియోజకవర్గ దళితుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, అడిషనల్ కలెక్టర్ చంద్ర రెడ్డి, అడిషనల్ డీసీపీ పూర్ణ చందర్, ఎస్సీ డిడి రామ రావు,ఏసీపీ లక్ష్మి నారాయణ,ఆర్డీవో సరిత, ఎంఆర్వో నాగయ్య, ఎస్సి డిడి రామరావు, మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబల్ నాయక్, సీఐ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ సీనియర్ నేత బాధే పల్లి సిద్దార్థ, కాంగ్రెస్ పార్టీ ఎస్సి తాలూక యువ నేత జాంగారి రవి, ఎస్సి సెల్ సీనియర్ నేత ఎరోళ్ళ జగన్, టౌన్ ఎస్సి సెల్ అధ్యక్షుడు సింగపాగ అనిల్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, ఎల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భవాని మల్లేష్, గ్రామ ఎస్సి సెల్ అధ్యక్షుడు వేణు గోపాల్, రవి,పాల్గొన్నారు..

## రైతులను పట్టించుకోని ప్రభుత్వం" ఈటల రాజేందర్ ఫైర్

ప్రజా సమస్యల కోసం తప్పకుండా నిలబడి కొట్లాడుతా ఈటెల
రైతుల గోస చూడలేకపోతున్న, వారిని సకాలంలో ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్న



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్** : హుజరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట మండల కేంద్రంలో మాజీ మంత్రి,మల్కాజ్గిరి ఎంపీ, ఈటెల రాజేందర్, మాట్లాడుతూ రైతుల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వంపై, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పంటలు చేతికి వచ్చాయిగాని, కాటన్ కొనుగోలు కేంద్రాల్లో మిల్లుల దోపిడీ రైతులను రోజులు తరబడి క్యూలలో నిలబెడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆరు గాలం కష్టపడితే చివరికి రైతుని ఇలానే ఇబ్బంది పెట్టాలా?" అని ప్రశ్నించారు.సన్నవడ్లకు ప్రకటించిన ?500 బోనస్ ఇప్పటికి అందరికి అందకపోవడంపై కూడా ఈటల మండిపడ్డారు. "ప్రతి రైతుకు హామీ ఇచ్చిన బోనస్ ఈసారి తప్పకుండా ఇవ్వాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే రైతులపై ఉన్న రెండు లక్షల రుణమాఫీ ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని, ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వరుసగా వర్షాలుతుఫానులు రావడంతో వరి పంట మట్టిపాలై, రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్న సమయంలో కూడా ప్రభుత్వం కనీసం ప్రకటించిన ?10,000 పరిహారం వెంటనే చెల్లించాలి అని ఈటల స్పష్టం చేశారు. పత్తి కొనుగోలు విషయంలో కూడా ప్రభుత్వం రైతుల పక్షాన ఉండాలని అన్నారు. 7 క్వింటాల, నిబంధనలు కొనుగోలు చేయడం రైతులను ఇబ్బంది పెట్టడమే. ఎలాంటి కండిషన్లు లేకుండా, కొనాలి" అని ఆయన అన్నారు. ఫసల్ బీమా విషయమై కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఈటల ఎత్తిచూపారు. "ఫసల్ బీమా సకాలంలో చెల్లిస్తే రైతులకు ఈరోజు ఇలాంటి ఇబ్బందులు ఉండేవే కావు" అని చెప్పారు.

**స్థానిక సంస్థల ఎన్నికలు ప్రాధాన్యతతో ఈటల కార్యాచరణ ప్రారంభం**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నందున వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి కీలక ప్రాధాన్యత ఉందని ఈటల పేర్కొన్నారు. జమ్మికుంటహుజురాబాద్ రెండు మున్సిపాలిటీల్లో కూడా బూత్ స్థాయిలో బలమైన వ్యూహంతో రంగంలోకి దిగుతామని తెలిపారు. "ఎమ్మెల్యే ఎన్నికల్లో నేను ఎలా కష్టపడ్డానో, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కూడా అంతే కష్టపడతాను" అని ఈటల స్పష్టం చేశారు. అతి త్వరలో నాయకులు, కార్యకర్తలతో స్ట్రాటజీ మీటింగ్ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు

# అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు ఆకలి తీర్చినా చంద్రగిరి సత్యనారాయణ




**సామాన్యుడి అస్త్రం జనగామ** చంద్రగిరి సత్యనారాయణ మానవతా దృక్పథంతో తానే స్వతగా ఇంట్లో పులిహోర తయారుచేసి జనగామ రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులకు నిరుపేద కుటుంబాలకు ఒక పూట ఆకలి తీర్చి మానవత్వం చాటుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో ఈరోజు చంద్రగిరి సత్యనారాయణ స్వతగా వండుకొని ఆహారాన్ని తీసుకువచ్చి జనగామ రైల్వే స్టేషన్ వద్ద పంచడం మేము కోరుకునేది కూడా ఇదే ప్రతి ఒక్కరు మీ మీ గ్రామ స్థాయి పట్టణస్థాయి నియోజవర్గ స్థాయిలో నిరాశ్రయులకు అనాధలకు నిరుపేద కుటుంబాలకు ఒక పూట ఆకలి తీర్చాలని ఇప్పుడున్న యువత ప్రజలు మానవతా దృక్పథంతో మీ మీ పుట్టినరోజు వేడుక సందర్భంగా పెళ్లిరోజు సందర్భంగా సందర్భం ఏదైనా కానీ ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలి తీర్చాలని కోరారు ఈ సేవా కార్యక్రమంలో జనగామ అమ్మ ఫౌండేషన్ టీం కొయ్యడా రవి పండుగ నరేష్ బింగి నరసింహులు ఎండి అప్రోచ్ బక్క మారయ్య బక్క సునీల్ వెంపటి అజయ్ రమేష్ ఎండి అజిత్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# ఇదెక్కడి డబల్ 'ధమాకా'..

షాద్ నగర్ లో కేటాయింపుకు ముందే డబుల్ బెడ్ రూముల కబ్జా..

ఎమ్మెల్యే సహకారంతో అంటూ గోడలపై రాతలు..

లబ్ధిదారులను రెచ్చగొట్టి పంపుతున్న నాయకులు..

ఎవరు అర్హులో.. ఎవరు అనర్హులో అర్థంకాని పరిస్థితి..


ఇళ్ల తలుపులకు తాళాలు వేస్తున్న జనం


అసలైన లబ్ధిదారులకు అన్యాయం..

చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు..

షాద్ నగర్ లో డబల్ బెడ్ రూంల వద్ద గందరగోళం

ఇళ్ల కోసం పరుగులు తీస్తున్న జనం – తాళాలు వేసేందుకు "సిగపట్లు"





**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** గత ప్రభుత్వం రెండు పడకల ఇండ్లను నిర్మించింది.. ప్రస్తుత ప్రభుత్వం అక్కడ సదుపాయాల కల్పన ద్వారా వాటిని అర్హులకు కేటాయించాలని చూస్తుంది.. అంతలోనే గందరగోళం మొదలైంది.. ఎవరికివారుగా ఇండ్లను కబ్జా చేసుకోవడం.. కొందరు తాళాలు వేసుకొని మరియు వెళ్లడం.. మరెవరు అడ్డుపడకుండా "ఎమ్మెల్యే సహకారంతో" అంటూ గోడలపై రాతలు రాయడం.. చర్చనీయాంశంగా మారింది.. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో నెలకొన్న సమస్య ఇది. పాలకులు పట్టింపు లేకుండా వ్యవహరించడం.. అధికారులు చూసి చూడనట్లుగా ఊరుకోవడంతో ఎవరికివారుగా ఈ ఇండ్లను ఆక్రమించుకుంటున్నారు. అర్హులు ఎవరో.. అనర్హులు ఎవరో గుర్తించక ముందే తాళాలు వేస్తున్నారు.. ఎవరి బలం ఉంటే వాళ్లే అన్నట్టు ఎవరు పడితే వారు వచ్చి ఒకరి వేసిన తాళం విరగొడుతుండగా మరొక తాళాలు వేసుకుంటున్నారు. ఇదేమని సిగపట్లు పట్టుకుంటున్నారు. ఒకసారి వివరంగా చెప్పుకుంటే..

**జరిగిన కథ..**

షాద్ నగర్ పరిధిలో గత తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇల్లు ఇవ్వాలన్న సంకల్పంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హయాంలో నియోజకవర్గానికి 1720 ఇండ్లను మంజూరు చేశారు. షాద్ నగర్ శివారులో గుండ్లకుంట తో పాటు, సోలిపూర్, దూసకల్, నందిగామ మండలాలలో ఈ ఇళ్లను నిర్మించారు. అయితే గత ప్రభుత్వం ఈ ఇండ్లను కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపిక కూడా చేపట్టింది. కానీ సకాలంలో నిర్మించి వారికి ఇవ్వడంలో జాప్యం చేసింది. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ప్రాంతానికి వచ్చిన అప్పటి మంత్రి కేటీఆర్ కొంతమంది లబ్ధిదారులను మాత్రం ఎంపిక చేసి వారికి ఇంటి పట్టాలు అందజేశారు. నిన్న మొన్నటి దాకా వాళ్లు మాత్రమే ఇక్కడ ఉంటూ వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులు సేకరించి ఈ ఇండ్లను అప్పగించే విషయంలో ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలే ఇక్కడ మిషన్ భగీరథ పనులను ప్రారంభించారు. పూర్తిస్థాయిలో ఇక్కడ సదుపాయాలు కల్పించి అనంతరం లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఇదంతా ఇప్పటిదాకా జరిగిన కథ.. ఇక వర్తమానం లోకి వస్తే..

**జరుగుతున్న కథ..**

గత ప్రభుత్వం ఈ ఇండ్లను కేటాయించేందుకు లబ్దిదారుల ఎంపిక చేపట్టింది. అయితే ఈ ఎంపికలో లోపాలు ఉన్నాయని, కొంతమంది అనర్హులకు ఇండ్లు కేటాయించారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. పూర్తిస్థాయిలో జాబితాను పరిశీలించి అర్హులకు ఎలాంటి అన్యాయం చేయకుండా అనర్హులను తొలగించి ఇండ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. అయితే ఇక్కడ మిషన్ భగీరథ పనులు ప్రారంభం కాగానే ఇళ్ల కేటాయింపు త్వరలోనే జరుగుతుందని ప్రకటించింది ఆలస్యం చాలామంది ఇక్కడికి వచ్చేసి ఇండ్లను ఆక్రమించుకుంటున్నారు. తమను ఎవరు అడ్డుకోకుండా ఎమ్మెల్యే సహకారంతో అంటూ అక్కడ బోర్డులు తగిలించేస్తున్నారు. కొంతమంది ఇండ్లకు తాళాలు వేసుకుని వెళ్లిపోతున్నారు. వీరిలో ఎవరికి ఇండ్లు కేటాయించారు.. ఎవరికి కేటాయించ లేదో కూడా తెలియదు. పట్టాలు చేతికి ఇవ్వకముందే ఎవరికి వారుగా వచ్చి ఇండ్లను కబ్జా చేసుకుంటుండడం చర్చనీయాంశంగా మారింది. కొంతమంది కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీల నేతలే జనాలను రెచ్చగొట్టి ఇలా రెండు పడకల ఇండ్లను కబ్జా చేసుకునేలా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా ఇప్పటిదాకా స్పందించలేదు. ఇక వీటిని తమ ఆధీనంలో ఉంచుకొని లబ్ధిదారుల జాబితా విడుదల అయిన తర్వాత కేటాయించాల్సిన అధికారులు కూడా ఈ వ్యవహారంలో చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తుంది. నిజంగా అర్హులు అయితే పట్టాలు ఇచ్చేదాకా ఆగితే నష్టం లేదు. జాబితాలో లేని అనర్హులు కూడా కొంతమంది ఇక్కడ మఖాం వేసినట్లు తెలుస్తోంది. దీనిని ఎమ్మెల్యేతో పాటు అధికారులు కూడా సీరియస్ గా తీసుకొని ఆక్రమణలను నిర్మూలించకుంటే భవిష్యత్తులో నిజమైన లబ్దిదారులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. కాబట్టి ఇకనైనా దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది..

# సమస్యను పరిష్కరించాలని అధికారులకు చెప్పుకుంటే- పెద్దరికం పేరుతో వెలివేస్తారా

తీవ్రంగా ఖండించిన ఆదివాసి సంక్షేమ పరిషత్- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు.




**సామాన్యుడి అస్త్రం రంపచోడవరం.** నరసాపురం మెటల్ క్వారీ వలన తమ గ్రామంలో నివాస గృహాలు కూలిపోయే పరిస్థితిలోకి వచ్చాయని కావున న్యాయం చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవోకు దరఖాస్తు చేసుకున్న దిరిసనపల్లి బల్లెం గంగాభవాని తండ్రి చిన్నల దొర వారి కుటుంబాన్ని వెలివేయడాన్ని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను తీవ్రంగా ఖండించారు. దీనిపై ఇప్పటికే బాధితురాలు పోలీస్ స్టేషన్లో ఐటీడీఏ నందు ఫిర్యాదు చేసి ఉండగా గురువారం నాడు బాధితులకు న్యాయం చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర డిజిపి కార్యాలయానికి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మరియు డైరెక్టర్ కు, ఏలూరు రేంజ్ డీఐజీ కి, జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ మొదలగు వారికి పోస్ట్ మరియు మెయిల్ ద్వారా ఈరోజు కంప్లైంట్ చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. ఆదివాసి ప్రాంతాల్లో నాన్ ట్రైబల్ అక్రమ వ్యాపారాలు వలన ఆదివాసులు సర్వం కోల్పోతున్నారని, కొంతమంది ఆదివాసులను మభ్యపెట్టి డబ్బులతో వశపరచుకొని ఆదివాసులకు సమస్యలు ఎదురవుతున్న ప్రశ్నించే వారిని సైతం వారి సమస్యలు చెప్పనివ్వకుండా నోరు నొక్కేయటం చేస్తున్న పెద్దమనుషులు ఈ క్రింది విషయాలు తెలుసుకోవాలని ఇతవు పలికారు చట్టపరమైన చర్యలు మరియు కేసులు 1. భారత శిక్షా స్మృతి కింద కేసులు: వేధింపులు బెదిరింపులు సెక్షన్ 506: ఒకరిని భయపెట్టడం లేదా బెదిరించడం వంటి చర్యలకు. పరువు నష్టం : సెక్షన్ 500: బహిష్కరణ ద్వారా లేదా అసత్య ఆరోపణల ద్వారా వ్యక్తి యొక్క పరువుకు నష్టం కలిగించినప్పుడు. అక్రమ సమావేశం : సెక్షన్ 143/149: బహిష్కరణ నిర్ణయాన్ని అమలు చేయడానికి చట్టవిరుద్ధంగా గుమిగూడినప్పుడు. ఇతర తీవ్రమైన చర్యలు శారీరక దాడులు లేదా హింస జరిగినట్లయితే సెక్షన్ 323 (గాయపరచడం) వంటి సెక్షన్లు ఇంకా అనేక సెక్షన్లు సెక్షన్ 3(1)(జడ్ఏ) 3(1) ఇది ఆర్థిక బహిష్కరణను నేరంగా పరిగణిస్తుంది. ఇందులో వ్యాపార లావాదేవీలకు, పనికి లేదా సేవలకు నిరాకరించడం వంటివి ఉంటాయి. సెక్షన్ 384: బెదిరింపు ద్వారా బలవంతంగా డబ్బు లేదా ఆస్తిని వసూలు చేయడం. సెక్షన్ 323/324/325: శారీరక గాయాలు కలిగించినప్పుడు. సెక్షన్ 34/149: నేరంలో ఎక్కువ మంది వ్యక్తులు పాలుపంచుకున్నప్పుడు . ఈ పై తెలియజేసిన చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారు కావున నాన్ ట్రైబల్స్ ఉచ్చులో పడి ఆదివాసులు ఆదివాసులు కొట్టుకునే పరిస్థితి మానుకొని సోషల్ బైకట్ వంటి దుర్మార్గమైన చర్యలు మానుకొని ఆదివాసులందరూ ఐక్యంగా ఉండాలని ఆయన ఇతవు పలికారు.

# బొల్లారం పరిధిలో రెండు వేర్వేరు విషాద ఘటనలు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం

**అస్త్రం, బొల్లారం :** బొల్లారం ప్రాంతంలో గురువారం రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన దుర్ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాణే కంపెనీలో కార్మికుడు మృతి ఉదయం సుమారు 09:00 గంటల సమయంలో బొల్లారం పరిధిలోని రాణే కంపెనీలో ప్రమాదవశాత్తూ ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన కృష్ణ సింగ్ (29) పైన రేకులు మార్చే పనులు చేస్తున్నప్పుడు పక్కనే ఉన్న వెంటిలేషన్ షీట్ విరిగి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం సమయంలో కార్మికులకు అవసరమైన సేఫ్టీ బెల్ట్‌లు, రక్షణ పరికరాలు ఇవ్వకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని మృతుడి గ్రామస్తుడు శివాజీ సింగ్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సంతోష్ వైన్స్ దగ్గర నిరాశ్రయుడి మృతి అదేవిధంగా బొల్లారం పట్టణంలోని సంతోష్ వైన్స్ ఎదుట ఢిల్లీకి చెందిన మనోజ్ (5055) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అడ్డు పనులు చేసుకుంటూ పోవు జీవితం గడిపే అతడు ఫుట్‌పాత్‌పై నిద్రించే వాడని, ఇటీవలి రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చలిని తట్టుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై బొల్లారం మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ నయీమ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మనోజ్‌కు సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే బొల్లారం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. పోలీసులు రెండు ఘటనలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.




## స్థానిక సంస్థ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఎగరాలి



**సామాన్యుడి అస్త్రం జనగామ** రాబోయే రోజుల్లో బిసి లు ఏకం కావాలి పల్లబోయిన అశోక్ ముదిరాజ్ ఉమ్మడి వరంగల్ ఇంచార్జ్ జనగామ జిల్లా కేంద్రంలో ని కమిటీ హల్ లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షులు చెరుకూరి మౌనిక, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్ ముదిరాజ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీఆర్పీ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి పల్లబోయిన అశోక్ ముదిరాజ్ హాజరై ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన బీసీల రాజ్యాధికార పార్టీ పవర్ ఏంటో చూపిద్దామని అని అన్నారు. నాయకులు,కార్యకర్తలు నిబద్ధత , అంకిత భావంతో పనిచేసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలిని పిలుపునిచ్చారు అదేవిదంగా గ్రామస్థాయి మండల స్థాయి నియోజకవర్గస్థాయి అన్ని కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ సింగారం రవీందర్, టీఆర్పీ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జీ కాసోజు బ్రహ్మచారి,మంద దిలీప్, గడ్డం కృష్ణ,జీట్టబోయిన నరేష్, బొప్పరి సతీష్, చిర్ర వీరస్వామి, దాసరి సంధ్యారాణి, చిలుకనీ, మహేందర్,ముక్క విష్ణు, వల్లల భానుచందర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వర్షపు నీరు నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి సిపిఎం నాయకులు మొహమ్మద్ అజరుద్దీన్




**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా కేంద్రంలోని గ్రేయిన్ మార్కెట్ రోడ్డులోని అరబిందో స్కూల్ దగ్గర ఉన్న కల్వర్ట్ పూర్తిగా చెత్త చెదారంతో ముసుకోపోయిన కారణంగా నీరు వెళ్లకపోవడంతో వర్షాల నైపేథ్యంలో అక్కడ భారీగా వర్షం నీరు ఆగి కాలని వాసులకు అలాగే రోడ్డు పై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నారని ఇందుకు గాను అక్కడ వర్షపు నీరు నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని, కల్వర్ట్ లోపల నిండిన మట్టి అలాగే చెత్తను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు మొహమ్మద్ అజరుద్దీన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు నాయకులు

## నీళ్లు లేక ప్రజలు ఇక్కట్లు చోద్యం చూస్తున్న శాఖ అధికారులు

మాకు నీళ్లు ఇప్పించండి మహాప్రభో అని వేడుకుంటున్న ప్రజానీకం

గత 20 రోజులుగా గుక్కెడు మంచినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు



**సామాన్యుడి అస్త్రం దేవీపట్నం.** అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం పరిధిలో గల మారుమూల గ్రామాలకు సత్య సాయి వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీళ్లు అందించేవారు గత 20 రోజుల నుంచి మంచినీళ్లు అందక పోవడంతో ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హై స్కూల్ దగ్గర ఉన్న వాటర్ ట్యాంక్ లో దగ్గరికి వచ్చి మంచినీళ్ల కోసం రాత్రనకా పగలనకా తేడా లేకుండా మంచినీళ్లు కోసం వాటర్ ట్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు వచ్చేది వేసవికాలం కావున సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి ప్రతి గ్రామానికి సత్యసాయి వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీళ్లు అందించి ప్రజలకు అందించాలని అల్లూరి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మారిసెట్లా వెంకటేశ్వరరావు (బుజ్జిబాబు)డిమాండ్ చేశారు

## గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు

గ్రంథాలయ పుస్తక ప్రదర్శన, సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలి, గ్రంథపాలకురాలు,జి సంధ్యారాణి



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల,మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల (గర్ల్స్) జూనియర్ కాలేజ్, కమలాపూర్‌లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు, జి. సంధ్యారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు పాఠశాల ప్రిన్సిపల్ వి. సౌజన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వి. సౌజన్య మాట్లాడుతూ, విద్యార్థినిలందరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలి. పుస్తక పఠనం ద్వారా చదువు, నిత్య జీవితం, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే అనేక జ్ఞానవిజ్ఞానాలను అభివృద్ధి చేసుకోవచ్చు" అని సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొని గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేశారు.

# రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి....

– అధికారులతో కలిసి శ్రీదేవి థియేటర్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ



**అస్త్రం, చందానగర్ :** చందానగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి లోని శ్రీదేవి థియేటర్ రోడ్ నుండి అమీన్‌పూర్ వరకు రూ. 45 కోట్ల అంచనావ్యయంతో చేపడుతున్న 4 లైన్ల రహదారి,2-లైన్ల సర్వీస్ రోడ్ విస్తరణ పనులను గురువారం పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ , కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి తో పాటు ప్రాజెక్ట్స్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఈ రహదారి విస్తరణ పనులు ప్రారంభించబడటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ పనుల్లో వేగంపెంచి,ఎటువంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే గాంధీ సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.రహదారి విస్తరణతో కలిగే ప్రధాన ప్రయోజనాలను వివరిస్తూ జాతీయ రహదారి 65 నుండి అమీన్‌పూర్ వరకు ప్రయాణం మరింత సులభంగా , ట్రాఫిక్ రహితంగా మారుతుందని అన్నారు.ఓఆర్ఆర్ ఎగ్జిట్ నం. 4 కు మరింత వేగంగా చేరుకోవడానికి ఇది తోడ్పడుతుందని అన్నారు.అమీన్‌పూర్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న జనసాంద్రత, అభివృద్ధికి అనుగుణంగా రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయని అన్నారు.భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ లింక్ రోడ్ అత్యంత కీలకమని పేర్కొన్నారు.ట్రాఫిక్ తగ్గి, ప్రయాణ సమయం, వాహనాల ఇంధన వ్యయం తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుంది.గతంలోనూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక ఫ్లైఓవర్లు, రోడ్లు, లింక్ రోడ్లు విజయవంతంగా నిర్మించామని, ప్రజల సౌకర్యం కోసం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గాంధీ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఈఈ నామ్యా, డీఈ హరీష్ బాబు, ఏఈ శివకృష్ణ యాదవ్, ఏఈ సౌమ్య, టౌన్ ప్లానింగ్ టిపిఎస్ రోహన్, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎండి ఇబ్రహీం, పోచయ్య, ఎల్లమయ్య, శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి, నరేందర్ బల్లా కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# హెచ్-సిటీ ప్రాజెక్ట్స్,నాలాల విస్తరణ పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**అస్త్రం, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న హెచ్-సిటీ ప్రాజెక్ట్స్ పనులు, ఎస్ఎన్‌డీపీ నాలాల విస్తరణ పనుల పురోగతిపై, మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీసీ ప్రశాంతి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హెచ్-సిటీ ప్రాజెక్ట్స్ ఎస్ఎన్‌డీపీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి రూ.1606 కోట్ల నిధులు కేటాయించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది రాష్ట్రంలోనే అగ్రగామి నియోజకవర్గంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ వెల్లడించారు.ఈ సందర్భంగా అయన అధికారులకు సూచనలు చేశారు.పనులను త్వరితగతిన, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలనీ,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అన్నారు.ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణలు తక్షణం చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే గాంధీ సూచించారు.వర్షాకాలం ముందు నాలాల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి అన్నారు.ఏ సమస్యలు వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మల్టీ లెవెల్ ఫ్లైఓవర్లు / గ్రేడ్ సెపరేటర్స్ రూ.837 కోట్ల నిధులతో సైబరాబాద్ కార్యాలయం నుండి గచ్చిబౌలి జంక్షన్ వరకు 215 అడుగుల రోడ్డు విస్తరణ పనులు,అంజయ్య నగర్ రాంకీ టవర్స్ వరకు 150 అడుగుల రోడ్డు విస్తరణ పనులు,జాతీయ రహదారి ఎన్ హెచ్ 65 శ్రీదేవి థియేటర్ నుండి అమీన్‌పూర్ రోడ్డు వరకు 100 ఫీట్ల విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మియాపూర్ చౌరస్తా నుండి ఆల్విన్ చౌరస్తా వరకు 6 లైన్ల బై-డైరెక్షనల్ ఫ్లైఓవర్ పనులు, లింగంపల్లి నుండి గచ్చిబౌలి వరకు 3 లైన్ల యూని-డైరెక్షనల్ అండర్‌పాస్ పనులు, రూ.124 కోట్లతో శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ ఆర్ఓబి నిర్మాణం పనులు,ఎస్ఎన్‌డీపీ నాలాల విస్తరణ పనులను చేపడుతున్నారు.వర్షాకాలం సమయంలో వరద ముంపు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా మంజూరు చేసిన పనులు:ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, ప్రాజెక్ట్స్ విభాగంఈఈ నామ్యా,డీఈ హరీష్ బాబు, ఎస్ఎన్‌డీపీ ఈఈ శ్రీనాథ్ రెడ్డి,డీఈ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలి

కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు

ఇందిరమ్మ ఇండ్లు ప్రొసీడింగ్ పత్రాల అందజేసిన నర్సింగరావు



**కోరుట్ల :** ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని ,నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమ ఆవుతాయనికోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు తెలిపారు.గురువారం పట్టణంలోని సినారె భవన్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు హాజరై మండలానికి సంబంధించిన 40 ఇందిరమ్మ ఇండ్లను ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగాజువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమ ఆవుతాయని నిర్మాణాలు త్వరగా చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో కోరుట్ల పట్టణానికి 500 ఇండ్లు కోరుట్ల మండలానికి 502 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో ఇంటి నిర్మాణాలు చేపట్టుకోవడానికి ఎవరు ముందుకు వచ్చేవారు కారని ఇప్పుడు ఇంటి నిర్మాణాలు చేపట్టుకున్న వారి ఖాతాలో డబ్బులు జమవడంతో ప్రతి ఒక్కరు ముందుకు వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కేవలం బిఆర్ఎస్ పార్టీ వారికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేస్తున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కోరుట్ల నియోజకవర్గానికి కేవలం 600 డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేశారని కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గానికి ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇండ్ల ప్రొస్టింగ్ పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. గతంలో స్వర్గీయ మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్ రావు పట్టణంలో సుమారు 4,500 ఇందిరమ్మ ఇండ్లను అందజేసిన విషయాన్ని జువ్వాడి నర్సింగరావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం లేదని మళ్లీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం జరుగుతుందని కావున ప్రొసిడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని సూచించారు.

## పాన్‌షాప్‌లో గంజాయి చాక్లెట్స్



అస్త్రం, బొల్లారం, లక్ష్మీనగర్: బొల్లారం పట్టణంలో అక్రమ నషా పదార్థాల విక్రయంపై పోలీసులు మరో కీలక దాడి నిర్వహించారు. లక్ష్మీనగర్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తూ గంజాయి ఆధారిత చాక్లెట్‌లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన అజయ్ కుమార్ దాస్ (50), తండ్రి ఆనంద్ కుమార్ దాస్, గత ఇరవైఏళ్లుగా బొల్లారం ప్రాంతంలో నివాసం ఉంటూ పాన్ షాప్ నడుపుతున్నాడు. తాజాగా అతడు ఒరిస్సా నుండి అక్రమంగా గంజాయి చాక్లెట్‌లను తెప్పించుకుని, అదే రాష్ట్రానికి చెందిన కొంతమంది వ్యక్తులు, అలాగే ఇతర రాష్ట్రాల వారికి కూడా రహస్యంగా విక్రయిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ మేరకు పోలీసులు అతడి పాన్‌షాప్‌పై అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మొత్తం 238 గంజాయి చాక్లెట్‌లు, అలాగే ?1,270 నగదు స్వాధీనం అయ్యాయి. క్లూస్ టీమ్ సహాయంతో సీజ్ చేసిన నిషేధిత పదార్థాలను ఆధారాలుగా నమోదు చేసి, అజయ్ కుమార్ దాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత విభాగాల్లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బొల్లారం పోలీసులు వెల్లడించారు. అక్రమ నషా పదార్థాల వ్యాపారంపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## మద్యం దుకాణాలను ప్రధాన రహదారుల నుండి దూరంగా మార్చాలని డిమాండ్

ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు




**అస్త్రం, బొల్లారం :**బొల్లారం మున్సిపల్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు దారితీసిన నేపథ్యంలో, బీజేపీ నాయకులు గురువారం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కొత్త మద్యం విధానం ప్రకారం డిసెంబర్ 1, 2025 నుండి కొత్తగా మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వనున్న నేపథ్యంలో, ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బీజేపీ నాయకులు తెలిపారు గత కొన్నేళ్లుగా బొల్లారం ప్రాంతంలో ప్రజా నివాసాల మధ్యే మద్యం దుకాణాలు నడవడం వల్ల స్థానికులకు తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయని, ముఖ్యంగా ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆ రహదారిలో మహిళలు ప్రయాణించే సమయంలో పెద్దఎత్తున అసౌకర్యాలు ఎదురవుతున్నాయని, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ తీవ్రత పెరుగుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే మున్సిపల్ పరిధిలో ప్రతి గల్లీకి ఒక బెల్ట్ షాప్ ఉండటం వల్ల విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, దీనివల్ల కార్మికులు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో అనేక కుటుంబాలు మద్యానికి బానిసై దారుణ పరిస్థితుల్లోకి జారిపోతున్నాయని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులను అరికట్టేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రం అందజేత కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి. రవీందర్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నుండి బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్ ఆగ్రహం

– "కేటీఆర్‌పై కాంగ్రెస్ చిల్లర డ్రామాలు కక్షపూరిత కేసులు ప్రజలు గమనిస్తున్నారు"




**అస్త్రం, శేరిలింగంపల్లి:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టించే రాజకీయాలు చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, శేరిలింగంపల్లి యువ నాయకులు రవీందర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు దిగిందని ఆరోపించారు. గవర్నర్ ఏసీబీ విచారణకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో స్పందించిన రవీందర్ యాదవ్ "రెండ్టుళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకేలా వ్యవహరిస్తున్నారు. ఫార్ములాఇ రేసు పూర్తిగా పారదర్శకంగా జరిగినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధ ఆరోపణలు చేసుకుంటూ కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నం చేస్తోంది" అని మండిపడ్డారు.రేవంత్ రెడ్డి ప్రజల దృష్టిని మరల్చేందుకు మరో 'చిల్లర డ్రామా' ఆడుతున్నారని, రాజ్యాంగబద్ధమైన ముఖ్యమంత్రిగా ప్రజల ప్రశ్నించే హక్కును అణగదొక్కడమే రేవంత్ రెడ్డి లక్ష్యమైందని ఆరోపించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంపునకు కేటీఆర్ తీసుకున్న చర్యలను ప్రజలు మరువరని, ఆయనపై పెట్టిన అక్రమ కేసులు రాజకీయ ప్రత్యర్థుల కుట్రలేనని స్పష్టం చేశారు. "కేటీఆర్‌కు బీఆర్ఎస్ పూర్తి అండగా ఉంది. కక్షపూరిత చర్యలను న్యాయపరంగా, ప్రజాస్వామికంగా ఎదుర్కొంటాం" అని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. "కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలంటే, గులాబీ సైనికులం అడ్డుకుంటాం. ప్రజలే కాంగ్రెస్ చేష్టలకు న్యాయం చెబుతారు" అంటూ ఆయన హెచ్చరించారు.

# చింతపండు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు



చింతపండు గురించి చెప్పగానే నోరు ఊరుతుంది. కానీ తీపి, పుల్లని చింతపండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా? అవును, మీరు విన్నది నిజమే. చింతపండును పోషకాహార నిధి అని కూడా పిలుస్తారు. చింతపండులోని పోషకాలు శరీరానికి అనేక ప్రయోజనాలను అందించడంలో సహాయపడతాయి. చింతపండును ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఈ సమస్యల నుండి శరీరాన్ని రక్షించుకోవచ్చు. చింతపండు గురించి చెప్పగానే నోరు ఊరుతుంది. కానీ తీపి, పుల్లని చింతపండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా? అవును, మీరు విన్నది నిజమే. చింతపండును పోషకాహార నిధి అని కూడా పిలుస్తారు. చింతపండులో ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు, ఫోలేట్, విటమిన్ సి, విటమిన్లు ఎ, ఇ, కె, బి6, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫైటోకెమికల్స్, యాంటీఆక్సిడెంట్లు, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందించడంలో సహాయపడతాయి. చింతపండును ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఈ సమస్యల నుండి శరీరాన్ని రక్షించుకోవచ్చు. చింతపండులో హైడ్రాక్సి సిట్రిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో ఎంజైమ్స్‌ను గ్రహించి కొవ్వు చేరకుండా నివారిస్తుంది. అందువల్ల శరీర బరువు కంట్రోల్‌లో ఉంటుంది. చింతపండు గుజ్జులో ఉండే ఫైబర్ శరీరంలో ఇంఫ్లమేషన్ నివారించి అజీర్ణం, గ్యాస్టిక్ సమస్యలను తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. చింతపండులో ఉండే టార్టారిక్ యాసిడ్ యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఉండే హానికారక ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. చింతపండులో యాంటీ-బ్యాక్టీరియల్ మరియు యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంపై ఏర్పడే గాయాలను రూపుమాపడంతో సమర్థవంతంగా పనిచేస్తాయి. చింతపండులో ఉండే పొటాషియం రక్తపోటు, హార్ట్‌బీట్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. చింతపండు రోజూ తీసుకుంటే రక్తహీనత సమస్యను తగ్గించుకోవచ్చు. చింతపండులో ఉండే పోషకాలు రక్తంలో ట్రైగ్లిజరాయిడ్స్‌ను పెంచి ఎర్రరక్తకణాల వృద్ధికి సహాయపడతాయి. చింతపండులో ఉండే యాంటీ సెప్టిక్ గుణాలు ఆస్తమాను నిరోధిస్తాయని తాజా పరిశోధనల్లో తేలింది. ముఖ్యంగా అలెర్జిక్ ఆస్తమాను నివారించడంలో బాగా ఉపయోగపడుతుంది. చింతపండులో ఫైబర్ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించి సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు బారిన పడకుండా మనల్ని కాపాడతాయి.

# కాలేయం ఆరోగ్యానికి ఒక కప్పు కాఫీ



బీపీ, షుగర్ మాదిరిగానే ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తోంది. కాలేయంలో కొద్దిగానే కొవ్వు ఉంటుంది. కానీ ఈ కొవ్వు, కాలేయం మొత్తం బరువులో పది శాతానికి మించి ఉంటే దాన్ని ఫ్యాటీ లివర్‌గా పరిగణిస్తారు. ఇది తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. ప్రస్తుత లైఫ్‌స్టైల్, చెడు ఆహార అలవాట్లు, అధిక మోతాదులో మద్యం తీసుకోవడం, ఊబకాయం, డయాబెటిస్.. ఫ్యాటీ లివర్‌కు ప్రధాన కారణం అని నిపుణులు అంటున్నారు. ఫ్యాటీ లివర్ రెండు రకాలు.. మద్యపానం కారణంగా వచ్చే.. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్, మద్యపానం కారణంగా వచ్చే ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్‌తో పాటు, మద్యం తాగకపోయినా వచ్చే నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్. ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ నిశ్శబ్దంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో 'ద లివర్ డాక్' పేరుతో ప్రసిద్ధి పొందిన హెపటాలజిస్ట్ డా. సైర్యాక్ అబ్బీ ఫిలిప్స్ కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. ఆయన చెప్పిన చిన్న చిన్న ఆహార, జీవనశైలి మార్పులు పాటిస్తే, ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడం, తిరిగి ఆరోగ్యంగా మార్చుకోవడానికి సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. మనం తీసుకునే ఆహారం, జీవనశైలి లివర్ ఆరోగ్యానికి ఎంతో కీలకం. లీవర్‌లోని కొవ్వు సామర్థ్యం అయిన 5 శాతానికి మించి కొవ్వు పేరుకుపోయినప్పుడు ఫ్యాటీ లివర్ అభివృద్ధి చెందుతుంది. కాలక్రమేణా ఇది పోషకాలను ప్రాసెసింగ్, టాక్సిన్ తొలగింపు, రక్తంలో చక్కెర నియంత్రణ వంచి జీవక్రియ విధులకు అంతరాయం కలిగిస్తుంది. మన డైట్‌లో అనారోగ్యకరమైన ఆహారాన్ని దూరం పెట్టి, పోషకాహారం తీసుకుంటే ఫ్యాటీ లివర్‌ను నియంత్రించవచ్చని డాక్టర్ ఫిలిప్స్ అన్నారు. కొన్ని ఆహారాలు ఫ్యాటీ లివర్ ముప్పును పెంచుతాయని డాక్టర్ ఫిలిప్స్ అన్నారు. స్వీట్స్, చక్కెర పానీయాలు ఎక్కువగా తీసుకుంటే లివర్‌లో కణాలలో ఇన్సుపలిన్ నిరోధకత, కొవ్వు నిల్వ పెరుగుతుంది. ఇది నాన్‌ఆల్కహాల్ ఫ్యాటీ లివర్ వ్యాధి ముప్పును గణనీయంగా పెంచుతుంది. భారతీయ వంటకాల్లో కొబ్బరి నూనె, పామాయిల్, వెన్న, నెయ్యి ఎక్కువగా వాడుతుంటాం. అయితే, వీటిలోని సంతృప్త కొవ్వులు లివర్‌లో కొవ్వు పేరుకునేలా చేస్తాయి. లివర్ పనితీరును దెబ్బతీస్తాయి. వీటిని తక్కువగా తీసుకుంటే లివర్ ఆరోగ్యానికి మంచిది అని డా. ఫిలిప్స్ సూచించారు. ఆల్కహాల్ లివర్ దెబ్బతినడానికి అతిపెద్ద కారణాలలో ఒకటిగా ఉంది. ఆల్కహాల్ తక్కువగా తీసుకున్నా లివర్ ఆరోగ్యాన్ని దిగజారుస్తుందని నిపుణులు అంటున్నారు. లివర్ ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి, ఫ్యాటీ లివర్ ముప్పును తగ్గించుకోవడానికి ఆల్కహాల్‌ను పూర్తిగా విడిచిపెట్టడమే మంచిది అని డాక్టర్ ఫిలిప్స్ అన్నారు. బ్లాక్ కాఫీ లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని డాక్టర్ ఫిలిప్స్ అన్నారు. ఇది లివర్ పనితీరుకు మద్దతు ఇస్తుందని, కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తుందని, వాపును తగ్గిస్తుందని అధ్యయనాలు చూపిస్తున్నాయి. యాంటీఆక్సిడెంట్లు, బయోయాక్టివ్ సమ్మేళనాలతో సమృద్ధిగా ఉన్న బ్లాక్ కాఫీ ఇన్సులిన్ సెన్సిటివిటీని, మొత్తం జీవక్రియ సమతుల్యతను మెరుగుపరుస్తుంది. రోజూ ఒక కప్పు బ్లాక్ కాఫీ తాగితే నాన్ ఆల్కాహాలిక్ ఫాటీ లివర్, ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ ముప్పును తగ్గించుకోవచ్చు.

# చలికాలంలో అల్లం టీ మ్యాజిక్.. రోజూ తాగితే సంపూర్ణ ఆరోగ్యం గ్యారంటీ!



చలికాలం ప్రారంభమైంది.. రోజురోజుకీ చలి తీవ్రత పెరిగిపోతుంది. ఈ సీజన్‌లో ఒంట్లో వేడిని పెంచే ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. అందులోనే శరీరానికి మేలు చేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. చలికాలం ప్రారంభమైంది.. రోజురోజుకీ చలి తీవ్రత పెరిగిపోతుంది. ఈ సీజన్?లో ఒంట్లో వేడిని పెంచే ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. అందులోనే శరీరానికి మేలు చేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న రోజుల్లో ఉదయాన్నే అల్లం టీ తాగితే శరీరంలో వేడి స్థిరంగా ఉంటుంది. ఇది సాధారణ డ్రింక్ మాత్రమే కాదు, ఒక పవర్‌ఫుల్ నేచురల్ రెమెడీ. అల్లంలో జింజరాల్స్, షోగాల్స్ అనే కాంపౌండ్లు యాంటీ-ఆక్సిడెంట్స్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ ప్రాపర్టీస్ ఉంటాయి. చీజదీ× రిసెర్చ్ ప్రకారం, అల్లం యాంటీ-ఇన్ఫ్లమేటరీ, యాంటీ-నాయూసియా ఎఫెక్ట్స్‌తో శరీరాన్ని రక్షిస్తుంది. చలికాలంలో దగ్గు, జలుబు వంటి సీజనల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. అల్లం టీ రోజూ తాగితే ఇమ్యూనిటీ పెరుగుతుంది. అల్లం శరీరంలో వేడిని పెంచడమే కాదు, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. చలికాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లు సాధారణం. అల్లం టీలోని జింజరాల్స్ గొంతు నొప్పి, దగ్గును తగ్గించి, శ్వాసకోశ సమస్యలను అరికడతాయి. అల్లం యాంటీ-మైక్రోబయల్ ప్రాపర్టీస్‌తో బాక్టీరియా, వైరస్‌లను చంపుతుంది. రోజూ ఒక కప్ అల్లం టీ తాగితే, ఫ్లూ, జలుబు రిస్క్ 30% తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అల్లంలోని విటమిన్ సి, మెగ్నీషియం రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. చలికాలంలో మెటబాలిజం తగ్గుతుంది. గ్యాస్, జీర్ణక్రియ సమస్యలు పెరుగుతాయి. అల్లం జీర్ణరసాలను పెంచి, గ్యాస్‌ను తగ్గిస్తుంది. అల్లం గట్ హెల్త్‌ను మెరుగుపరచి ఉబ్బరం, వికారాన్ని తగ్గిస్తుంది. ఇది గ్యాస్ట్రిక్ ఎంప్టీయింగ్‌ను వేగవంతం చేస్తుంది. చలికాలంలో హెవీగా ఉండే ఆహారం జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. చలికాలంలో రక్తనాళాల్లో బ్లడ్ ప్రెషర్ పెరుగుతుంది. అల్లం రక్త ప్రసరణను మెరుగుపరచి, ఆక్సిజన్ సరఫరాని పెంచుతుంది. అల్లం ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించి, క్లాట్ ఫార్మేషన్ సమస్యను తగ్గిస్తుంది. తరచుగా అల్లం తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. అల్లం శరీరాన్ని వేడిగా ఉంచి, లెథర్జీని అరికడుతుంది. గ్రీన్ టీతో కలిపి అల్లంని తీసుకుంటే చలికాలంలో ఎండ్యూరెన్స్ పెరుగుతుంది, ఇది థర్మల్ సెన్సేషన్‌ను మెరుగుపరుస్తుంది, శరీరంలో శక్తిస్థాయిల్ని పెంచుతుంది. అల్లం మెన్స్ట్రువల్ క్రాంప్స్, మసల్ సోర్‌నెస్, ఆస్టియోఆర్థ్రైటిస్ పెయిన్‌ను తగ్గిస్తుంది. వెయిట్ మేనేజ్‌మెంట్‌కు కూడా సహాయపడుతుంది, మెటబాలిజమ్‌ను బూస్ట్ చేస్తుంది.

# ఇమ్యూనిటీ బూస్ట్ చేసే సీక్రెట్ వెపన్స్!



చలికాలం వచ్చిందంటే చాలు... ఒక్కసారిగా జలుబు, దగ్గు, జ్వరాలు లైన్ కట్టినట్టు వస్తాయి. ఎందుకంటే ఈ ఋతువులో మన రోగనిరోధక వ్యవస్థ కాస్త బలహీనపడుతుంది. కానీ భయపడాల్సిన పని లేదు! కొన్ని సీజనల్ పండ్లను మీ రోజువారీ ఆహారంలో జోడించడం ద్వారా ఇమ్యూనిటీని గట్టిగా నిల్పొని, ఈ వైరస్‌లను సులువుగా తరిమికొట్టవచ్చు. నిపుణులు ఈ మహమ్మారి కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. విటమిన్ సి బాంబులుగా పనిచేసే నారింజ, కివీ, దానిమ్మ పండ్లు ఈ సీజన్‌లో మీ బెస్ట్ ఫ్రెండ్స్. ఒక్కో నారింజ తిన్నా రోజంతా కావాల్సిన విటమిన్ సి దాదాపు పూర్తిగా లభిస్తుంది. కివీలో అయితే విటమిన్ సి నారింజ కంటే దాదాపు రెట్టింపు ఉంటుంది! దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్స్ శరీరంలోని హానికర ఫ్రీ రాడికల్స్‌ను నాశనం చేస్తాయి. ఈ మూడింటితో పాటు రోజూ ఒక యాపిల్ తింటే ఫైబర్, విటమిన్స్ రెండూ సమపాళ్లలో లభిస్తాయి. చలికాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉంటుంది కాబట్టి విటమిన్ డి లోపం సహజంగానే వస్తుంది. ఈ లోపం ఇమ్యూనిటీని మరింత దెబ్బతీస్తుంది. కాబట్టి ఉదయం 15-20 నిమిషాలు సూర్యరశ్మి తగిలేలా గడపడం, వైద్యుడి సలహాతో విటమిన్ డి సప్లిమెంట్స్ తీసుకోవడం మంచిది. ఇది మీ శరీరాన్ని వైరస్‌ల నుంచి బలమైన కవచంలా కాపాడుతుంది. అంతేకాదు, రోజంతా వేడి వేడి నీళ్లు సిప్ చేస్తూ ఉండటం, అల్లం-తులసి జావ, టమాటా సూప్, చికెన్ సూప్ లాంటివి తాగితే శరీరం హాయిగా వేడెక్కుతుంది, గొంతు కూడా సేద తీరుతుంది. ఈ చిన్న చిన్న అలవాట్లతోనే ఈ చలికాలంలో డాక్టర్ దగ్గరకు పరుగులు పెట్టకుండా ఆరోగ్యంగా, ఉల్లాసంగా గడపొచ్చు!

# వీరికి తేనె విషంతో సమానం!



మారుతున్న లైఫ్‌స్టైల్, ఆహారపు అలవాట్ల కారణంగా జనాలు అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందులో డయాబెటిస్ ఒకటి. ఈ వ్యాధిగ్రస్తులు చక్కెరను తినకూడదు.. అందుకని వీరు చక్కెరకు బదులు ప్రత్యామ్నాయాల కోసం ఎక్కువగా తేనెను తీసుకోవడం స్టార్ట్ చేశారు. అదే కాకుండా తీనే మన ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలు చేస్తుంది.. అయితే ఇది అందరికీ మంచిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తేన ప్రమాదకరమని అంటున్నారు. తేనే మన ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలు చేసినప్పటికీ వృద్దులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనికి దూరంగా ఉండాలని, వీలైనంతా తక్కువగా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఎందుకంటే తేనెలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ ఉంటుంది ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఇది మదుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది కాదు. తేనె, తేనెటీగ పుప్పొడి లేదా ఏదైనా ఇతర తేనెటీగల సంబంధిత ఉత్పత్తులకు అలెర్జీలు లేదా హైపర్సెన్సిటివిటీ ఉన్నవారు తేనెను నివారించాలి. అలాగే ఇతర ఆరోగ్య సమస్యలకు యాంటీకోగ్యులెంట్, యాంటీప్లేట్‌లెట్ మందులు తీసుకునేవారు కూడా తేనెను తినకూడదు. ఎందుకంటే ఇది రక్తస్రావం ప్రమాదాన్ని పెంచుతుంది. ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు తేనె ఇవ్వడం అస్సలు ఇవ్వకూడదు. ఎందుకంటే ప్రాసెస్ చేయని తేనెలో తేనెటీగ కుట్టడం, చిన్న కీటకాలు, పురుగుమందులు, రసాయనాలు ఉండవచ్చు, ఇవి పిల్లలలో వాంతులు, వికారం, జ్వరానికి కారణమవుతాయి. కాబట్టి పిల్లలకు తేనెను ఇచ్చేముందు వైద్యులను సంప్రదించండి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం, పురుషులు రోజుకు తేనె వంటి 9 టీస్పూన్ల (36 గ్రాములు) వరకు స్వీటెనర్లను తీసుకోవచ్చు. అలాగే మహిళలు రోజుకు 6 టీస్పూన్ల (24 గ్రాములు) వరకు స్వీటెనర్లను తీసుకోవచ్చు. ఎవరూ అంతకు మించి తేనె తినకూడదని వైద్యులు చెబుతున్నారు.

## యాక్షన్ అవతార్‌లో నాగచైతన్య.. ఎన్‌సీ 24 బీటీఎస్ వీడియో చూస్తే గూస్‌బంప్స్ అంతే..!



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగ చైతన్య ప్రస్తుతం విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ వర్మ దండుతో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఎన్‌సీ 24 ప్రాజెక్టుగా వస్తోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం మైథలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రానికి సంబంధించి ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. ఎన్‌సీ 24 బీటీఎస్ మేకింగ్ వీడియోను విడుదల చేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నవంబర్ 23న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. నాగచైనత్య కెరీర్‌లో ఇదివరకెన్నడూ చేయని స్టంట్స్ చేయబోతున్నాడని బీటీఎస్ వీడియో చెప్పేస్తుంది. ఈ సినిమా కోసం కథలో చాలా కీలకమైన రంగురంగుల కోటను భారీ బడ్జెట్‌తో ప్రత్యేకంగా నిర్మించినట్టు అర్థమవుతోంది. ఈ కోట సినిమాకే హైలెట్‌గా నిలువబోతున్నట్టు విజువల్స్ చెబుతున్నాయి.

## గ్లామర్ క్వీన్ ట్రెడిషనల్ లుక్



ప్రస్తుతం సోషల్ మీడియాలో హీరోయిన్స్ ఎక్కువగా యాక్టివ్ గా ఉంటున్నారు. సినిమా అప్డేట్స్ షేర్ చేస్తుంటారు. అలాగే రోజూ క్రేజీ క్రేజీ ఫోటోషూట్లతో రచ్చ చేస్తుంటారు. గ్లామర్ మోడ్రన్ లుక్ లో అరాచకం సృష్టించడమే కాదు.. అప్పుడప్పుడు ట్రెడిషనల్ లుక్ లోనూ కట్టిపడేస్తుంటారు. తాజాగా ఓ బ్యూటీ లేటేస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఎంతోమంది హీరోయిన్స్ వస్తుంటారు. ఒకటి రెండు చిత్రాలతోనే స్టార్ డమ్ సంపాదించుకున్న తారలు ఉన్నారు. మరికొందరు తొలి సినిమాతోనే భారీ డిజాస్టర్ ఖాతాలో వేసుకుంటారు. దీంతో ఆ తర్వాత ఊహించని విధంగా తెలుగు చిత్రాలకు దూరమవుతుంటారు. హిందీ, కన్నడ, మలయాళీ భాషలకు చెందిన అమ్మాయిలు తెలుగులో కథానాయికలుగా దూసుకుపోతుంటారు. పైన ఫోటోలో రాజకుమారిలా ముస్తాబైన ఈ హీరోయిన్ తెలుగు సినిమాతోనే నటిగా తెరంగేట్రం చేసింది. కానీ అందం, అభినయంతో మెప్పించినప్పటికీ అదృష్టం మాత్రం కలిసిరాలేదు. ఆమె నటించిన తొలి చిత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. దీంతో బాలీవుడ్ షిఫ్ట్ అయిన ఈ అమ్మడు .. అక్కడే బ్యాక్ టూ బ్యాక్ సినిమాల్లో నటిస్తూ స్టార్ డమ్ సంపాదించుకుంది. ఈ అమ్మడు కుర్రవాళ్ల హాట్ ఫేవరేట్. తెలుగులో కేవలం రెండు సినిమాల్లో నటించింది. ఫస్ట్ మూవీ అట్టర్ ఫ్లాప్ కాగా.. సెకండ్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్టయ్యింది. అయినప్పటికీ తెలుగులో ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ.3 కోట్ల వరకు వసూలు చేస్తుంది. పైన ఫోటోలో కనిపిస్తున్న హీరోయిన్ మరెవరో కాదు.. బీటౌన్ బ్యూటీ దిశా పటానీ. తెలుగులో లోఫర్ సినిమాతో నటిగా తెరంగేట్రం చేసింది. వరుణ్ తేజ్ నటించిన ఈ మూవీ అంతగా ఆకట్టుకోలేదు. దీంతో హిందీలో వరుస సినిమాలు చేస్తూ అక్కడే బిజీ అయ్యింది. చాలా కాలం తర్వాత ప్రభాస్ జోడిగా కల్కి చిత్రంలో నటించింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. కల్కి సినిమా దాదాపు 1000 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇటీవల సూర్య జోడిగా కంగువ చిత్రంలో కనిపించింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ అమ్మడు చీరకట్టులో మరింత అందంగా మెరిచింది.

## రచయిత హత్య నేపథ్యంలో అర్జున్ సర్జా 'మఫ్టీ పోలీస్'

ఐశ్వర్యా రాజేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'తీయవర్ కులై నడుంగ'. ఈ పోలీస్ ఇన్వెస్టిగేషన్ మూవీ తెలుగులో 'మఫ్టీ ?ోలీస్' టైటిల్‌తో రేపు రిలీజ్ కానుంది. దినేష్ లక్ష్మణన్ దర్శకత్వంలో రూ?ందిన ఈ చిత్రాన్ని తెలుగులో శ్రీలక్ష్మిజ్యోతి క్రియేషన్స్ ద్వారా ఏఎన్ బాలాజీ విడుదల చేస్తున్నారు. "ఒక రచయిత హత్య నేపథ్యంలో పోలీస్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందింది. ఇటీవలి కాలంలో కొందరు పిల్లలకు ఇబ్బందిగా మారిన ఆటిజం వ్యాధి గురించి కూడా ఈ సినిమాలో చర్చించడం జరిగింది. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు ఏఎన్ బాలాజీ.





## 18 నెలల్లో 24 మంది.. టెస్టు జట్టుపై ప్రయోగాలకు బ్రేక్ పడేనా?

దిగ్గజాల వీడ్కోలుతో భారత టెస్టు జట్టు సంధి దశను ఎదుర్కొంటోంది. ఇంగ్లండ్ పర్యటనతో శుభ్‌మన్ గిల్ శకం మొదలైనా.. స్వదేశంలో మళ్లీ తడబాటు ఆందోళన రేకెత్తిస్తోంది. వెస్టిండీస్ క్లీన్‌స్వీప్‌తో గాడిలో పడినట్టే కనిపించిన టీమిండియా ఈడెన్ గార్డెన్స్ లో అనూహ్య ఓటమి చవిచూసింది. టర్నింగ్ పిచ్, బ్యాటింగ్ ఆర్డర్లో మార్పులు, మరోవైపు బెడిసికొడుతున్న కోచ్ గౌతం గంభీర్ ప్రయోగాలు.. ఇలా మొదటి టెస్టులో పరాజయానికి కారణాలు అనేకం. అన్నింటికంటే ముఖ్యంగా సుదీర్ఘ ఫార్మాట్ టీమ్‌ను గంభీర్ ప్రయోగశాలగా మార్చడం మాజీ ఆటగాళ్లు, అభిమానులను ఒకింత ఆందోళనకు గురి చేస్తోంది. ఒకప్పుడు సొంతగడ్డపై అజేయశక్తిగా ప్రత్యర్థుల భరతం పట్టిన భారత జట్టు గత ఏడాది పట్టు కోల్పోయింది. న్యూజిలాండ్ చేతిలో సిరీస్ ఓటమి టీమిండియాకి పెద్ద షాక్. ఈ షాక్ నుంచి తేరుకునేలోపే అశ్విన్ రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ వీడ్కోలు పలికారు. టెస్టు సారథిగా ఎంపికైన శుభ్‌మన్ గిల్ ఇంగ్లండ్ పర్యటనలో బ్యాటర్‌గా రెచ్చిపోయాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో ప్రయోగాలకు తెరతీసిన గంభీర్.. మూడో స్థానంలో కరుణ్ నాయర్ సాయి సుదర్శన్ ను ఆడించి చూశాడు. స్వదేశంలో వెస్టిండీస్ సిరీస్‌కు నాయర్‌పై వేటు వేసిన సెలెక్టర్లు సాయికి మరో అవకాశమిచ్చారు. ఈ కుర్రాడు కూడా ఒక అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. కానీ.. అతడిని ఒక్క సిరీస్‌కే పరిమితం చేశారు.

డబ్ల్యూటీసీ ఛాంపియన్ దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్‌కు అతడిని పక్కనపెట్టేసి వాషింగ్టన్ సుందర్‌కు ఓటేశారు. మూడో స్థానంలో వచ్చిన సుందర్ రెండు ఇన్నింగ్స్‌ల్లో 29, 31 పరుగులతో నిరాశపరిచాడు. కీలకమైన ఆ స్థానంలో సుదర్శన్‌ను ఆడించి ఉంటే ఫలితం మరోలా ఉండేదని కోచ్ గౌతీని పలువురు విమర్శించారు. అయితే.. మాజీ కోచ్‌లు రవిశాస్త్రి, రాహుల్ ద్రవిడ్ సైతం పలువురు క్రికెటర్లను పరీక్షించారని వాదిస్తున్నారు కొందరు. ఈ అంశంపై మాజీ ప్లేయర్, ప్రస్తుతం కామెంటేటర్‌గా రాణిస్తున్న ఆకాశ్ చోప్రా ఏమన్నాడంటే..? 'టెస్టు జట్టుపై కోచ్ గంభీర్ ప్రయోగాలు చేస్తున్నాడు. కానీ, అవేవీ పెద్దగా ఫలించడం లేదు. మాజీ కోచ్‌లు రవిశాస్త్రి, రాహుల్ ద్రవిడ్‌లు తమ హయాంలో 30 నుంచి 35 మంది ఆటగాళ్లను పరీక్షించారు. చివరకు పటిష్టమైన జట్టును తయారుచేశారు. ఇప్పుడు గౌతీ కూడా అదే చేస్తున్నాడు. కానీ, అతడు కోచ్‌గా వచ్చిన 18 నెలల్లోనే 24 మందిని టెస్టు చేశాడు. శాస్త్రి, ద్రవిడ్‌ల లెక్కన చూస్తే గంభీర్‌కు మరో 11 మందిని టెస్ట్ చేయొచ్చు. సీనియర్ల వీడ్కోలు తర్వాత ఏర్పడిన సంధి దశను దాటే క్రమంలో జట్టులోకి కొందరు వచ్చిపోతుంటారు. ఎందుకంటే.. అశ్విన్, రోహిత్, కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయడం అంత తేలిక కాదు. అదృష్టవశాత్తూ ఒకటిరెండు మ్యాచ్‌లకే కొందరు దొరుకుతారు. కొన్నిసార్లు మరికొన్ని రోజులు నిరీక్షించకతప్పదు' అని ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య గువాహటిలో నవంబర్ 22న రెండో టెస్టు మొదలవ్వనుంది. వాతావరణ మార్పుల దృష్ట్యా ఉదయం 9 గంటలకు మ్యాచ్ ప్రారభం కానుంది. అంతేకాదు విచిత్రంగా ఈ డే టెస్టులో లంచ్ కంటే ముందే టీ సెషన్ ఉండనుంది.



### ఒక్క మ్యాచ్‌లో మెరుస్తూ..

టెస్టు జట్టుకు నిలకడగా రాణించే ఆటగాళ్లు అవసరం. కానీ, కుర్రాళ్లు దేవ్‌దత్ పడిక్కల్, నితీశ్ రానా, ఆకాశ్ దీప్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రానాలు ఒక్క మ్యాచ్‌లో మెరుస్తూ.. ఆ తర్వాత తుస్సుమంటున్నారు. అయితే.. కీలకమైన మూడో స్థానంలో సాయి సుదర్శన్ లేదంటే పడిక్కల్‌కు వరుసగా అవకాశమివ్వాలి. తద్వారా వారు ఆత్మవిశ్వాసంతో మంచి స్కోర్లు చేసే జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకుంటారు. అలానే మ్యాచ్ విన్నర్ అయిన పేసర్ షమీ(%ూష్ఘుఎఱ%)ని సెలెక్టర్లు ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టేయడం కూడా జట్టుపై ప్రభావం చూపిస్తోంది. బుమ్రా ఆడనప్పుడు సిరాజ్‌కు తోడుగా షమీ ఉండడం చాలా అవసరం. అందుకే.. ఇకనైనా షమీని తీసుకోవాలని కోచ్ గంభీర్‌కు మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ సూచించిన విషయం తెలిసిందే.

### గిల్ స్థానంలో అతడే ఆడతాడు: టీమిండియా కోచ్

సౌతాఫ్రికాతో రెండో టెస్టులో టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఆడతాడా? లేదా? అన్న సందిగ్ధం నెలకొంది. కోల్‌కతాలో తొలి టెస్టు సందర్భంగా మెడ నొప్పి కారణంగా గిల్ మధ్యలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా.. మరుసటి రోజు డిశ్చార్జ్ అయ్యాడు. అయితే, గిల్ మెడ నొప్పి మాత్రం పూర్తిగా తగ్గలేదు. ఇంకా పూర్తిస్థాయిలో మ్యాచ్ ఫిట్‌నెస్ కూడా సాధించలేదు. ఈ నేపథ్యంలోనే అతడు గువాహటి టెస్టు ఆడడనే వార్తలు వచ్చాయి. ఈ విషయంపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ గురువారం స్పందించాడు. "గిల్ కోలుకుంటున్నాడు. నిన్ననే అతడిని కలిశాను. తనకు పెద్దగా సమస్య లేదు. అయితే, అతడు ఆడతాడా? లేదా అన్న అంశంపై శుక్రవారం సాయంత్రమే స్పష్టత వస్తుంది. ఫిజియోలు, డాక్టర్ల నిర్ణయాన్ని బట్టే అతడి ఆడించాలా? వద్దా? అన్నది తేలుతుంది. ప్రస్తుతానికి గిల్



వేగంగా కోలుకుంటున్నాడు. కానీ మ్యాచ్ సమయంలో నొప్పి మళ్లీ తిరగబెట్టే అవకాశాలను కొట్టిపడేయలేము. ఒకవేళ ఏదైనా తేడా అనిపిస్తే కచ్చితంగా అతడికి విశ్రాంతినిస్తాం. ఏదేమైనా కీలక బ్యాటర్, కెప్టెన్‌గా గిల్ సేవల్ని మాత్రం మేము కోల్పోతాము. అయినా మరేం పర్లేదు. ఒకవేళ గిల్ ఆడకపోయినా.. మాకు చాలా మంది బ్యాటర్లు అందుబాటులో ఉన్నారు. వాళ్లంతా ప్రొఫెషనల్ ఆటగాళ్లే. జట్టు కోసం వచ్చి ఆడతారు. గిల్ ఆడాలనే మేమూ కోరుకుంటున్నాం. అయితే, అతడి ఆరోగ్యానికే మొదటి ప్రాధాన్యత. గిల్ స్థానంలో వచ్చే ఆటగాడు సెంచరీ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. గిల్ ఆడే నాలుగో స్థానంలో ధ్రువ్ జురెల్ అందుబాటులో ఉండనే ఉన్నాడు. అయితే, గిల్ ప్లేస్‌లో తుదిజట్టులోకి ఎవరు వస్తారనేది రేపే నిర్ణయిస్తాం" అని సితాన్షు కొటక్ తెలిపాడు.

## స్పోర్ట్స్

### బంగ్లాదేశ్ బౌలర్ల విజృంభణ.. పతనం దిశగా ప్రత్యర్థి



ఢాకా వేదికగా ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ బౌలర్లు రెచ్చిపోయారు. ముష్ఫికర్ రహీం (106), లిటన్ దాస్ (128) సెంచరీల సాయంతో భారీ స్కోర్ (476) చేసిన అనంతరం ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశారు. హసన్ మురద్ 2, ఖలీద్ అహ్మద్, తైజుల్ ఇస్లాం, మెహిది హసన్ తలో వికెట్ తీయడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 98 పరుగులు మాత్రమే చేసి సగం వికెట్లు కోల్పోయింది. ఆండ్రూ బల్బిర్నీ (21), పాల్ స్టిర్లింగ్ (27), కేడ్ కార్మికెల్ (17), హ్యారీ టెక్టార్ (14), కర్టిస్ క్యాంఫర్ (0) ఔట్ కాగా.. లోర్కన్ టక్కర్ (11), స్టీఫెన్ డోహ్నీ (2) క్రీజ్‌లో ఉన్నారు. బంగ్లా తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ఐర్లాండ్ ఇంకా 378 పరుగులు వెనుకపడి ఉంది. అంతకుముందు కెరీర్‌లో వందో టెస్ట్ ఆడుతున్న ముష్ఫికర్ సెంచరీతో కదంతొక్కాడు. మరో శతక వీరుడు లిటన్ దాస్‌తో కలిసి ఐదో వికెట్‌కు 108 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. ముష్ఫికర్ ఔటైన అనంతరం దాస్ మెహిది హసన్‌తో (47) కలిసి మరో కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. బంగ్లా ఇన్నింగ్స్‌లో మొమినుల్ (63) అర్ధ సెంచరీతో రాణించగా.. ఓపెనర్లు మహ్మదుల్ జాయ్ (34), షద్మాన్ ఇస్లాం (35) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఐర్లాండ్ బౌలర్లలో ఆండీ మెక్‌బ్రైన్ 6 వికెట్లతో సత్తా చాటాడు. కాగా, ఐర్లాండ్ జట్టు రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుంది. తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో గెలుపొందిన బంగ్లా 1-0తో ఆధిక్యంలో కొనసాగుతుంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.